ఏప్రిల్-2024

# హన్నాకృప

ఆధ్యాత్మిక మాస పత్రిక

## విషయసూచిక


| | | |
|---|---|---|
| సంపాదకీయం | చింతింపకుడి | 02 |
| జప్పుత్తనేహు | కొడవటికంటి | 03 |
| నా చిత్తానుసారుడు | కొడవటికంటి | 06 |
| పరుగో పరుగు | కె.ఇ. రాజేంద్ర | 08 |
| యెహోవా నాటిన చెట్లు | డా॥ సుష్మ, నెల్లూరు | 09 |
| మధ్యకాలము | హన్నాకృప డెస్క్ | 10 |
| నీ సృష్టికర్త | హన్నాకృప డెస్క్ | 11 |
| ప్రార్థన ఆలకించువాడు | సాక్ష్యము | 13 |
| క్రొత్తకోణాలు | అద్దంకి జాన్‌వెస్లీ | 15 |
| కృపాదానం | కొడవటికంటి | 18 |
| బత్షెబ | స్త్రీల కొరకు | 20 |
| చెడుస్నేహం | చిన్నపిల్లల పేజి | 22 |
| బైబిల్ క్విజ్-04 | | 24 |



**సంపాదకులు :**

**కె. ఇమ్మానియేల్ రాజేంద్ర**
B.A.,B.L.,


**చందా వివరాలు :**
సంవత్సర చందా రూ. **350/-**
పోషక చందా రూ. 1500/-
జీవితచందా రూ. 5000/-



**చిరునామా :**
ఎడిటర్, హన్నాకృప
పోస్ట్‌బాక్స్ నెం. 51 , క్లోపేట, 6వలైను
ఒంగోలు-523001, ప్రకాశంజిల్లా
సెల్ : 9440217726



**బ్యాంకు అకౌంటు వివరాలు :**
A/c Name: **K. Emmanial Rajendra**
A/c No.: **10957294340**
Bank: SBI Main Branch, Ongole
IFSC Code : SBIN0000890


| సీరియల్ నంబరు | |
|---|---|

సంపాదకీయం....

# చింతింపకుడి

హన్నాకృప పాఠకులకు ప్రభువు నామమున వందనములు!

దేవుడు మనిషిని చేసినప్పుడు తాను చేసిన సృష్టిలోని సమస్తమును చూచి సంతోషించాలని కోరుకొని, మనిషి దేనివిషయం కూడా చింతించాల్సిన అవసరం రాకూడదనే మనిషిని చేయడానికి ముందే మనిషికి అవసరమైనవన్నీ సమకూర్చాడు. అయితే మనిషి తనకు అవసరంలేని దానిని ఆశించి దేవుడు తనకు ఇచ్చిన ఆధిక్యతలన్నీ పోగొట్టుకున్నాడు. అప్పటి నుండి మనిషికి చింత ప్రారంభమయ్యింది. ఉదయం నిద్ర లేచిన దగ్గర్నుండి మళ్ళీ పడుకోబోయే వరకు చింతిస్తూనే ఉంటాము. ఏదో ఒక విషయం మనల్ని బాధిస్తూనే ఉంటుంది. కుటుంబ విషయాలు, ఉద్యోగ, వ్యాపార విషయాల్లో మనకి చింత ఉంటుంది. మానవులుగా మనం అనేక రకాల సమస్యలతో ప్రతిదినము చింతిస్తుంటాము. కుటుంబంలోని వ్యక్తుల గురించి, ఉద్యోగ వ్యాపారాల గురించి, మనం చింతించుట వలన మనకు మనం ఏ మేలు చేసికొనలేము. మీలో ఎవరైనా చింతిస్తూ ఉండటం వలన తన యెత్తు మూరెడు ఎక్కువ చేసికోలేడు కదా! అంటే చింతించటం వలన ఎలాంటి ఉపయోగం లేదు అని అర్థము. చింత అనేది భయం వలన కలుగుతుంది. రేపటిని గూర్చి చింతింపకుడి అని యేసుప్రభువు చెప్పాడు. భవిష్యత్ గురించి చింతించని వారు ఎవరూ వుండరు. సాతాను దగ్గర ఉన్న పెద్ద ఆయుధం భయపెట్టడం. ప్రతి ఒక్కరికి భవిష్యత్తు చూపించి భయపెడుతుంది 'ఎలా బ్రతుకుతావు?' అని ప్రతి ఒక్కరినీ నిరుత్సాహపరుస్తూ దేవునికి దూరం చేస్తుంటుంది. అందుకే ప్రతి ఒక్కరూ భవిష్యత్ గురించి చింతిస్తుంటారు. కేవలం దేవున్ని నమ్మకపోవడమే మన చింతకి కారణం. దేవున్ని నమ్మిన వారికి చింతించడానికి ఏ కారణము ఉండదు. ఎందుకంటే దేవున్ని నమ్మిన వారు దేవుని మీద ఆధారపడతారు కాబట్టి వారి ప్రతి చింతని దేవునికి అప్పచెప్తారు. ఏ విషయం గురించైనా మనం చింతిస్తే దేవుని దృష్టిలో మనం అన్యజనులమే. 'అన్యజనులు వీటన్నిటి విషయమై విచారింతురు. ఇవన్నియు మీకు కావలెనని మీ పరలోకపు తండ్రికి తెలియును' (మత్తయి 6:31,32). 'ఇవన్నియు కావలెనని మీ పరలోకపు తండ్రికి తెలియును' అన్న వాక్యమునుబట్టి దేవున్ని నమ్మినవారు ధైర్యంగా ఉంటారు. యేసుప్రభువు మన గురించి చింతించుచున్నాడు. 'ఆయన మిమ్మును గూర్చి చింతించుచున్నాడు. గనుక మీ చింత యావత్తు ఆయన మీద వేయుడి' (1పేతురు 5:7). మనం ఏర్పరచుకొనే తంత్రముల వలన మనకు వచ్చే కష్టాలను చూచి ప్రభువు మన కొరకు చింతిస్తున్నాడు. ప్రభువు మన కొరకు ఏమైనా చేయగలడు గనుక మన చింత యావత్తు ఆయన మీద వేయవచ్చు. దేవున్ని హృదయపూర్వకముగా నమ్మేవారు ఎవరూ ఏ విషయమై చింతింపరు. ఎందుకంటే వారి ప్రతి కష్టాన్ని, బాధని దేవుడు చూస్తున్నాడు అన్న నమ్మకంతో దేవుని చిత్తానికి వదిలేస్తారు. 'దేవుడు తన ఐశ్వర్యము చొప్పున క్రీస్తుయేసునందు మహిమలో మీ ప్రతి అవసరమును తీర్చును' (ఫిలిప్పీ. 4:19). దేవుడు మీ గురించి ఆలోచిస్తూ తగిన సమయంలో మీ ప్రతి అవసరాన్ని తీరుస్తాడు కాబట్టి ఏ విషయము గురించి అయినా మీరు చింతించకుండా నిశ్చింతగా ఉండండి.

*–ఎడిటర్, కొడవటికంటి ఇమ్మానియేల్ రాజేంద్ర*

K. Emmanial Rajendra, SBI Main Branch, Ongole
**A/c No. 10957294340**

# జప్నత్పనేహు



**(యోసేపు జీవిత చరిత్ర)**

- కొడవటికంటి

"ఎంతకాలం అయింది ఈ సంగతి జరిగి?" అని అడిగింది.

"బహుశా ఇప్పటికి రెండువందల సంవత్సరాలు అయి ఉండవచ్చును. అబ్రాహాముగారు ఈ దేశము చేరినప్పుడు ఈ దేశ ప్రజలు అబ్రాహాముగారి భార్య, శారా మిక్కిలి సౌందర్యవతియై ఉండుట చూచారు. ఫరో యొక్క అధిపతులు ఆమెని చూచి ఫరో యెదుట ఆమెను పొగిడారు. కనుక ఆమె ఫరో యెదుటికి తేబడింది. ఎందుకంటే అబ్రాహాముగారు తన భార్య అందంవల్ల తనకు ప్రాణహాని కలుగుతుందని భయపడి ఆమె తన చెల్లెలు అని చెప్పి ఉంటాడు" అని చెప్పాడు.

"అలా అబద్ధం చెబితే, మీ దేవునికి కోపం అని నీవంటావు గదా? మరి మీ తాత అబద్ధం ఎలా చెప్పాడు?" అని అడిగింది.

మళ్ళీ యోసేపు "అబద్ధం కాదు. నిజానికి శారాగారు ఒక వరసలో ఆయనకు చెల్లెలు అవుతుంది." అంటూ మళ్ళీ మొదలు పెట్టాడు. "శారాను బట్టి ఫరో అబ్రాహాముగారికి ఎంతోమేలు చేశాడు. అతనికి గొర్రెలు, గొడ్లు, మగ గాడిదలు, ఆడుగాడిదలు, దాసులు, పనికత్తెలు, ఒంటెలు ఇచ్చాడు. అయినప్పటికి మా దేవుడు ఫరోను అతని ఇంటి వారిని మహా వేదనలచేత బాధించాడు. అప్పుడు ఫరో వారికి సంగతి అర్థం అయింది. పరుల భార్యలను తాకితే దేవుని కోపాగ్నికి గురికావలసి వస్తుందని తెలుసుకున్నాడు. శారా అబ్రాహాముగారి భార్య అని గుర్తించాడు. వెంటనే అబ్రాహాముగారిని పిలిపించి, మెత్తగా మందలించి, శారాని అప్పగించి, ఆ దేశము నుండి పంపివేశాడు. ఆ విధంగా పరుని భార్యని ఆశించినందుకు ఫరోకు, దేవుని విశ్వసించక అబద్ధమాడిన అబ్రాహాముగారికి శిక్ష కలిగింది అని అన్నాడు.

"ఇవన్నీ నీవు నమ్ముతున్నావా?" అని అడిగింది.

"ఇందులో నమ్మకుండా ఉండడానికి హేతువు ఏమీలేదు. చిన్నప్పటి నుండి దేవుని భయంతో పెరిగాను కనుకనే నన్ను చంపాలని అనుకొని నన్ను అమ్మిన అన్నలను కూడా ప్రేమించి, నేను ప్రేమించే నా తండ్రి దగ్గరకి వెళ్ళుటకు నాకు విడుదల ఇచ్చినా, నేను పొందలేదు. ఏది ఏమైనా ప్రతి దుష్కార్యం వెనుక, దండన వెంటాడుతూనే ఉంటుంది" అన్నాడు. ఆమె ఒక గంటకొట్టి బానిసను పిలిచింది. ద్రాక్షారసం రెండు గ్లాసులు తెమ్మంది. ఇద్దరూ త్రాగిన తర్వాత గ్లాసులు తీసుకొని బానిస వెళ్ళిపోయింది.

"దుష్కార్యం అంటే ఏమిటి?" అని అడిగింది.

యోసేపు కొంచెం ఆలోచించి, ఏదో చెప్పబోయి ఆగిపోయాడు.

"చెప్పు, పరవాలేదు" అని మళ్ళీ అడిగింది.

"దుష్కార్యం అంటే ఇతరులను మోసగించటం, బాధించటం మానసిక క్షోభకు గురిచేయటం. నరహత్య అంత పాపం" అని చెప్పాడు.

"ఇప్పుడు నేను మిమ్ములను వాంఛిస్తే, అది ఎవరికి నొప్పికలుగ చేస్తుంది? ఎవరిని బాధిస్తుంది?" అంది తను గెలిచినట్లుగా సంతోషిస్తూ.

"ఈ కార్యము తెలిసిన క్షణం నేను నా యజమానికి ద్రోహం చేసినట్లు అవుతుంది. ఏదైనా ఈ లోకంలో కొంత కాలమే రహస్యం. కొంతకాలం తర్వాత ఏదీ రహస్యం కాదు. ఈ ప్రపంచంలో రహస్యం అనేది లేదు" అన్నాడు యోసేపు.

"నీవెన్ని మాట్లాడినా, నా ఉద్దేశ్యం నెరవేరుతుంది. ఈ రోజు కాకపోతే రేపు. నీలో మార్పు తప్పక వచ్చి తీరుతుంది" అని విసురుగా లేచి, "ఓను యాజకుని ఇంటికి వెళ్దాము రండి అంటూ చెయ్యి పట్టుకుని లేపింది. యోసేపు

మౌనంగా లేచి వాకిలి వద్దకు వచ్చినప్పుడు, ఆమె యోసేపు చెయ్యి వదలింది.

రథం ఓను యాజకుని ఇంటివద్ద ఆగకముందే ఆసెనతు లేడిపిల్లలా గంతులు వేస్తూ, రథం దగ్గరికి వచ్చింది. రథ ద్వారం తెరచి ఎదురుగా కూర్చొని ఉన్న యోసేపును చూచి, కొంచెంసేపు నిరుత్తరిణిఅయిపోయింది. కదలకుండా తలుపుకు అడ్డంగా అలాగే నిలుచుంటే, యోసేపుకు ఏమి చెయ్యాలో తోచలేదు. అంతలోనే తమాయించుకొని "రండమ్మ గారు!" అంటూ, యజమానురాలిని పలుకరించింది ఆసెనతు. ఆ రాత్రి భోజనాలవద్ద యోసేపు వారితో కలవ లేదు. తన స్థితికి తగినట్లుగానే తను వేరుగా భోజనం చేసాడు. రాత్రి పది గంటలకు పోతీఫరు, యజమానురాలు రథంలో ఇంటికి వస్తే, యోసేపు గుర్రం మీద ఇంటికి వచ్చాడు.

ఆ రాత్రంతా యోసేపు నిద్రపోలేదు. తన మనసులోని వేదనను ఎవరితోనైనా పంచుకోవాలనుకున్నాడు. అక్షాపు ఈ దివాణంలో పని చేసేటప్పుడు తనతో స్నేహితుని గాను, విదేశీభాషలు వ్రాయటం, చదవటం నేర్పించిన గురువుగానే కాక, అనేక విషయాలలో తనకు వయస్సు నేర్పిన పాఠాలు ఎన్నో చెప్పాడు. పోతీఫరుగారు ఉద్యోగంలో హెచ్చించబడి రాజఖైదీల మీద ఏలికగా చేయబడినప్పుడు, అక్షాపును ఆ చెరసాల కార్యనిర్వాహకునిగా నియమించాడు. అందువలన పోతీఫరు ఇల్లు వదలి ఇవతల ఉన్న చెరసాల భవంతిలో తన భార్యబిడ్డలతో ఉన్నాడు. ఎప్పుడో కొన్ని నెలలకు ఒకసారి మాత్రమే కలుసుకోవడానికి వీలు అవుతుంది. ఇప్పుడు తన యజమానురాలి విషయంలో ఏ విధంగా మెలకువగా ఉండాలో అక్షాపుని అడగాలని అనుకున్నాడు. కాని ఈ సంగతి అతనికి చెప్పాలని అనుకోవటం వలన తన యజ మానుని భార్య రహస్య జీవితాన్ని తాను ఇతరులకు బయలు పరచినట్లవుతుంది అనుకున్నాడు. అంతేకాక పోతీఫరన్నా, ఆయన భార్యన్నా తనకు ఎంతో గౌరవం ఉండి, తన్ను తాను ప్రేమించుకొనిన దానికంటే, వారి కుటుంబం యొక్క పరువు కాపాడటంలోనే తన కృతజ్ఞతా భావం చూపించగలడు. ఈ విషయాలు ఏవి చెప్పకుండానే ఈ గృహనిర్వాహకత్వము నుండి తను ఏ విధంగా బయటపడగలడు? రాత్రి పదకొండు గంటలయ్యింది. యోసేపు తన గదిలో కూర్చోలేకపోయాడు. లేచి గుర్రం ఎక్కి బయలు దేరాడు. అంత రాత్రి తను గుర్రం మీద వెళ్తుంటే కాపలావాళ్ళు ఆశ్చర్యంతో చూసారు. తను ఎప్పుడు రాత్రుళ్ళు ఇంటిలో నుండి వెళ్ళలేదు. తన హోదాలో ఉన్న వారందరూ మెంఫిస్‌లో లభ్యమయ్యే అన్ని రకాల సంతోషాలలో ఈ సమయంలో మునిగిపోయి ఉంటారు. కాని తను ఎన్నడు బయట కార్యక్రమాలలో పాల్గొనలేదు. కనుకనే తనకు ఒక్క స్నేహితుడు కూడా లేడు.

ఒక అరగంట ప్రయాణంలో అక్షాపు పనిచేసే చోటుకు చేరాడు. అక్షాపు ఇప్పుడు రాజఖైదీలు ఉంచబడే చెరసాలలో పని చేయటం లేదని తెలిసింది. కాని ఇప్పుడు ఫరో యొక్క ధాన్య సేకరణ మీద అధిపతిగా ఉన్నాడని తెలిసి, మరల అరగంట ప్రయాణం చేశాడు. రాత్రి నడిజామున వాకిలి తట్టిన యోసేపును చూసి అక్షాపు ఎంతో సంతోషించి, లోపలికి తీసికొని వెళ్ళాడు. ఇల్లు నిశ్శబ్దంగా ఉంది. తన గది లోనికి తీసికొని వెళ్ళి, "ఇంత రాత్రివేళ వచ్చావంటే సామాన్యమైన విషయం కాదు. తొందరగా చెప్పు" అన్నాడు సంతోషంగా.

యోసేపుకు ఏడుపు వచ్చినంత పనయింది. ఏమి చెప్పాలో అర్థం కావట్లేదు. 'కాని ఏదో ఒకటి చెప్పకుండా వెనక్కి వెళ్ళలేను కదా!' అనుకున్నాడు. యోసేపు ముఖం చూచి అక్షాపు అదే అనుకున్నాడు. కాని యోసేపును బలవంతం చేయలేదు. 'తను వచ్చిన కార్యము ఏదో ఓ రూపంలో బయటకు చెప్పకపోతే, తానే అన్ని మూలలు ముడివేసి అసలు రహస్యం బయటకు లాగవచ్చును' అను కున్నాడు యోసేపు.

"నాకు కొంతకాలం సెలవు తీసుకోవాలని ఉంది" అన్నాడు యోసేపు.

"ఎక్కడికి వెళ్ళాలి? మీ తండ్రిగారి ఇంటికి వెళ్తావా?" సంతోషంగా అడిగాడు అక్షాపు.

"లేదు. ఎక్కడికైనా వెళ్లి కొంచెం క్రొత్తదనం చూడాలని ఉంది" అని అనుమానంగానే అన్నాడు. అంటే అక్షాపు

దీన్ని నమ్మడు అని తెలిసి.

“నీకు ఆ సంస్థానంలో రోజూ ఒక క్రొత్త ప్రయోగం. అది కాదు సంగతి. నా దగ్గర నీకు దాపరికం లేదు కదా? ఏంటి సంగతి?” అడిగాడు అక్షాపు.

“మరేమిలేదు. ఎందుకో కొంతకాలం ఎక్కడికైనా వెళ్ళాలని ఉంది” అన్నాడు. ముఖమంతా చెమటలు పట్టాయి. ఏ విధంగా నొక్కిపట్టినా నిజం బయటికి రాక తప్పదన్నట్లుగా ఉంది.

“మన యజమానుడు పోతీఫరు, ఆయన భార్య మరీ ఎక్కువగా నన్ను ప్రేమించటం వలన నాకు బాధాకరంగా ఉండి ఉండవచ్చును. లేకపోతే, మన యాజమానురాలి యొక్క ధైర్యం, చురుకుతనం, ముందు ముందు నన్ను ఇబ్బందిలో పడవేయవచ్చును. ఎందుకంటే నేను బానిసగా అమ్మబడినవాడిని. కనుక ఏ నేరమైనా, తప్పైనా, శిక్షయినా స్వతంత్రులను ఏమి చెయ్యవు గదా!” అన్నాడు యోసేపు.

“నిజమే! కాని పోతీఫరు, ఆయన భార్య ఇద్దరూ ఇతరులకు మేలు చేసేవారే కాని, ఇంతవరకు కీడు చేయలేదు. మరి నీకెందుకు ఈ అనుమానాలు?” అని కొంచెం ఆగాడు అక్షాపు. యోసేపు మాట్లాడలేదు. అక్షాపు ఆలోచిస్తున్నాడు. చాలాసేపు ఇద్దరూ మౌనంగా ఉన్నారు. అక్షాపు నిట్టూర్పు విడిచాడు. “యోసేపూ...” అని పిలిచాడు.

యోసేపు తల ఎత్తి చూశాడు.

“ఇప్పుడు నీ వయస్సెంత’? అన్నాడు ఆలోచనగా...

“ఇరవై ఆరు సంవత్సరాలు” చెప్పాడు యోసేపు.

“ఇప్పుడు వచ్చిన చిక్కంతా అక్కడే! నీ వయస్సు నిన్ను కష్టపెట్టక పోయినా, నిన్ను చూసేవాళ్ళని ఇబ్బందుల్లో నెట్టి వేస్తుంది. అందులోను అందగాడివి. ఆమె కూడా సౌందర్య” అని ఆగిపోయాడు. ఇప్పుడు అక్షాపుకు పూర్తిగా యోసేపు బాధ అర్థమయ్యింది, ఇంక దానిని పొడిగించ లేదు. అక్షాపు కూడా తనవలె పోతీఫరును, అతని భార్యను అతని సమస్తమును గౌరవించి, యధార్థంగా ప్రేమించేవాడే కదా!

“అదే! యజమానురాలు నాకు ఇబ్బంది కలుగ జేస్తున్నారు. ఆమెను నేను అమితంగా ప్రేమిస్తున్నాను, గౌరవిస్తున్నాను. కానీ నా అభిమానం ఆత్మీయమైనది. ఆమెది శారీరకమైనది. ఈ బాధ భరించలేను. నేను కేవలం ఒక దాసుడను. నేనేమి చెయ్యగలను? ఎట్లా ఎదిరించగలను? ఎలా లోబడగలను?” అంటూ కన్నీళ్ళు కార్చాడు. అయినా తమాయించుకొని “అక్షాపూ..!” నాకొక ప్రమాణం చెయ్యాలి” అని చెయ్యి చాపాడు యోసేపు.

“నీ కొరకు నేనేమైనా చేస్తానని నీకు తెలుసు కదా! నాకు ఈ లోకంలో అన్న దమ్ములు లేరు. నీవే నా తమ్ముడవు అనుకుంటాను. చెప్పు, నీ కొరకు ఏమి చెయ్యమంటావు?” అని చెయ్యి చాపాడు.

యోసేపు అక్షాపు ముఖంలోనికి సూటిగా చూస్తూ, “ఇంతకు ముందు నీకు చెప్పిన విషయాలలో నాకేమైనా సంభవిస్తే, నా మీద ప్రమాణం చేసి, మన యజమాని కాని, అతని భార్య కాని నిర్దోషులుగా నీవు నమ్మి ఇతరులు నమ్మేటట్లు చెయ్యాలి. నేను నిర్దోషినని నీవు నమ్మినా ఆ సంగతి బయటకు రానివ్వకూడదు. చివరకి అది నా మరణమైనా సరే” అన్నాడు. **(సశేషం)**

**ఫోన్‌పే ద్వారా లేదా గూగుల్ పే ద్వారా**
**చందా పంపించాలంటే**
**ఈ క్రింది క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి**

Scan & Pay Using PhonePe App

Emmanial Rajendra

సీరియల్

# నా చిత్తానుసారుడు

18

(దావీదు జీవిత చరిత్ర)

- కొడవటికంటి

"ఇప్పటికి దాదాపు రెండువందల సంవత్సరాల క్రితం మిద్యానీయులు,అమాలేకీయులు ఇశ్రాయేలీయులను ఇలానే హింసించారు. అప్పుడు దేవుడు న్యాయాధిపతులను వారిలో నుండి లేపి రక్షించాడు. ఆనాడు ఇశ్రాయేలీయులకు రాజు, సైన్యములేదు. ప్రతివాడును తన తన ఇష్టానుసారంగా ప్రవర్తించుచూ వచ్చారు. ఈనాడు రాజు ఉన్నాడు, సైన్యం ఉంది ప్రజల వద్దనుండి ఎంతో డబ్బు వసూలు చేస్తున్నాడు. కష్టం వచ్చినప్పుడు ప్రజలను ఆదుకోనివాడు రాజెలా అవుతాడు?" అన్నాడు అబీషై.

ఇశ్రాయేలీయులకు రాజు యెహోవాయే. అయితే వారు అన్యజనాంగాలవలె తమకు కూడా రాజు కావాలని కోరుకొంటే దేవుడు కాదనలేదు. అయితే ఆ రాజు ప్రజలను కాపాడలేకపోతే గొఱ్ఱెలను కాస్తున్న తనను రాజునకు అల్లునిగా చేసి నేడు రాజ్యంలేని రాజుగా చేసి ఆరువందల మంది సహచరులను ఇచ్చినందుకు తాను కెయిలా వెళ్ళి అచ్చటి ప్రజలకు అండగా ఉండాలా? చాలాసేపు ఆలోచించాడు.

తన దగ్గర వున్న ఆరువందల మందిలో, సైన్యంలో సౌలు దగ్గర ఉన్నవారు వందమందికంటే ఎక్కువ మంది లేరు. మిగిలినవారు ధైర్యం గలిగినవారే. కళ్ళములలో ధాన్యం దోచుకొన వచ్చిన ఫిలిష్తీయులకు కూడా యుద్ధం అంత బాగా తెలియదు. అయినా వారికి మంచి కత్తులు ఈటెలున్నాయి.

తన చిన్నతనంలో ఫిలిష్తీయులతో యుద్ధం వచ్చినప్పుడు ఇశ్రాయేలీయుల వద్ద ఆయుధాలు లేనప్పుడు యౌవ్వనుడైన యోనాతాను తన ఆయుధాలు మోయువానితో ఏమన్నాడు?

అనేకుల చేతనైనను, కొద్దిమందిచేతనైననూ రక్షించుటకు యెహోవాకు అడ్డమా? అని చెప్పి ఆ రోజు ఇశ్రాయేలీయులకు గొప్ప రక్షణ కలుగచేయలేదా! అదీకాక తాను గొల్యాతు మీదకు చేతికర్రతో పోయినప్పుడు యుద్ధము యెహోవాదే, అనలేదా! అబ్యాతారును పిలువమని అబీషైతో చెప్పాడు అబ్యాతారు వచ్చినప్పుడు ఏఫోదును తీసుకొని రమ్మన్నాడు. తన నివాసములోనికి ముగ్గురూ వెళ్ళారు.

అబ్యాతారు ఏఫోదు ధరించి నిలిచాడు. వారు కూడా మోకరిల్లి "నేను వెళ్లి ఈ ఫిలిష్తీయులను హతము చేయుదునా అని కళ్ళు మూసుకొని" అడిగాడు. అబ్యాతారు ప్రానువలె నిశ్చలంగా నుంచున్నాడు. అబీషై వీరిద్దరినీ చూస్తున్నాడు.

"నీవు వెళ్ళి ఫిలిష్తీయులను హతము చేసి కెయీలాను రక్షించుము" అనే స్వరం అబ్యాతారులో నుండి వెలువడింది.

దావీదు లేచి నిలుచుని అబీషై చేయిపట్టుకొని బయటకు వచ్చాడు. కొంచెంసేపటికి అబ్యాతారు బయటకు వచ్చాడు.

"అబీషై నీవు వెళ్ళి నా సహోదరులతో చెప్పి కెయీలా మీదకి వచ్చిన ఫిలిష్తీయు లను ఎదుర్కొనుటకు దండును సిద్ధము చేయుమని" చెప్పు అన్నాడు దావీదు.

తాను లోనికి వెళ్ళి గొల్యాతు కత్తి నడుముకు కట్టుకొని బయటకు వచ్చినప్పుడు, తన సహచరుల మీద అధిపతులుగా నియమించిన వీరులు ఆరుగురు తన సహోదరులు వచ్చి నిలుచున్నారు.

వారిలో యెజ్రెయేలీయుడైన రెఫాయా అనువాడు ముందుకు వచ్చి "మేము ఇచ్చట యూదాదేశములో ఉండినను మాకు భయముగా నున్నది. ఫిలిష్తీయుల సైన్యములకెదురుగా కెయీలాకు మేము వచ్చిన యెడల మరింత భయము కలుగును కదా!" అన్నాడు.

దావీదు ఏమి మాట్లాడలేదు. "యెహోవా యొద్ద విచారించి బయలు దేరుదామా?" అని అడిగాడు వారందరూ తలలూపారు.

అబ్యాతారు ఏఫోదు ధరించి నిలుచున్నాడు. అక్కడ ఉన్నవారందరూ మోకరించారు. ఇప్పుడు దేవుడు మాట్లాడబోతున్నాడు.

"ప్రభువా నేను కెయీలాకు వెళ్ళుదునా?" అని అడిగాడు దావీదు.

"నీవు లేచి కేయీలాకు వెళ్ళుము. ఫిలిష్తీయులను నీ చేతికి అప్పగించెదను" అనే మాటలు అబ్యాతారు కళ్ళు మూసికొని పలికాడు.

తన అన్నలు ఆరుగురుని చూసాడు. ఈ మధ్య ఒక అన్న చనిపోకుండా ఉంటే తనకు ఏడుగురు అన్నలు ఉండేవారు అనుకున్నాడు. ఆ రాత్రి భోజనం అయిన తరువాత పన్నెండు గుంపులుగా విభజించి ప్రతి గుంపువారు నడవవలసిన మార్గం కెయీలాను ఎలా ముట్టడించ వలసినది, కెయీలా కోటకు ఉన్న ద్వారాలన్నీ చెప్పాడు. తర్వాత అబీషైతో కలసి గుఱ్ఱం మీద ప్రయాణమయ్యాడు.

కెయీలా అడ్డగడియలు గుమ్మములు బురుజులు గల పట్టణం. కాని ఆ బురుజుల మీద సైనికులు ఎవరూ లేరు. ఫిలిష్తీయులకు చేరువలో ఉన్నందునను, తన మనస్సు సరియైన స్థితిలో లేకుండుట వలనను సౌలు ఆ కోట విషయం పట్టించుకోలేదు. కొద్దిమంది మాట పలుకుబడి కలిగిన వారు ఆ కోటలో పెత్తనం చేస్తున్నారు.

మధ్యరాత్రికి కెయీలా చేరినా తెల్లవారే వరకు దావీదు అబీషై పన్నెండు గుంపుల అనుచరులను ఉత్సాహపరుస్తూ వారికి ధైర్యం కలుగచేశారు.

ఒకరినొకరు గుర్తించ గలిగినంత వెలుగు రాగానే దావీదు సైన్యమంతా ఫిలిష్తీ యుల మీద పడ్డారు. ఫిలిష్తీ యులు ఎన్నడూ ఊహించనైనా లేని ఈ సంఘటనలో వారి ఆయుధములు వారి యొద్ద లేనందున, అన్నపానములతో రాత్రంతా మత్తులై నందున ఫిలిష్తీయులను లెస్సగా ఓడించారు.

దావీదు అనుచరులందరికీ దోపుసొమ్ములో మంచి కత్తులు, ఈటెలు, డాళ్ళు దొరికినవి. ఇప్పుడు ఆయుధము లకేమి కొదువలేదు. ఇటువంటి కోటలో కాపురముంటే ఆ అడవిలో జీవించినందువలన కలిగే అనారోగ్యము నుండి తప్పించుకోవచ్చు. ఇంకా కొంత సైన్యం పెంచుకొని తాను రాజుగా స్థిరపడవచ్చునని దావీదు అతని అనుచరులు తలంచారు. అదీకాక సౌలురాజు ఇవ్వలేని రక్షణ కెయీలా వారికి దావీదు ఇచ్చాడు. కనుక కెయీలా వారు కృతజ్ఞతలో ఉంటారని అనుకున్నారు.

దావీదు స్వతంత్రుడైన తరువాత ఈ విజయం అతని కెంతో మనఃస్థైర్యమును కలిగించినది. ఇంతకు ముందు తాను ఎన్నో యుద్ధాలు చేసాడు. అన్నిటిలోను విజయోత్సా హమే కలిగినది. కాని ఈ యుద్ధం తాను స్వతంత్రించి నాయకునిగా జయించినది.

కెయీలా వాసులు వారి వారి ధాన్యం వారికి దక్కి నందుకు దావీదు యెడల అతని అనుచరుల యెడల ఎంతో ఆదరాభిమానాలతో ప్రవర్తించారు. చాలాకాలమునకు ద్వారములు అడ్డగడియలు కలిగిన పట్టణంలో నివశించటం సంతోషం కలిగించినది. హారెతు అరణ్యంలో వదలి వచ్చిన కుటుంబములను వృద్ధులను కూడా కెయీలాకు పిలిపించు కొని ఇక్కడే నివసించాలి అని అనుకున్నారు.

ఆ రాత్రి షేలహు వచ్చాడు. సౌలు కెయీలా మీదకు దండెత్తి రావటానికి సైనికులందరిని వారి వారి గ్రామముల నుండి పిలిపిస్తున్నాడని చెప్పాడు. అదీగాక దావీదు కెయీలాలో నివసించడం దావీదును బంధించుటకు దేవుడు సౌలుకు ఇచ్చిన అవకాశంగా భావిస్తున్నాడని, ఈ పాటికి గిబియా నుండి బయలుదేరి సగం దూరం ప్రయాణం చేసి యుండవచ్చునని చెప్పాడు.

దావీదు యాజకుడైన అబ్యాతారును ఏఫోదును తెమ్మన్నాడు. పన్నెండుమంది ముఖ్యులను పిలిచి అందరూ మోకరించిన తరువాత "ఇశ్రాయేలీయుల దేవా! యెహోవా, సౌలు కెయీలాకు వచ్చి నన్నుబట్టి పట్టణమును పాడు చేయనుద్దేశించు చున్నాడని నీ దాసుడనైన నాకు రూఢీగా తెలియబడియున్నది. కెయీలా జనులు నన్ను అతనిచేతి కప్పగింతురా? నీ దాసుడనైన నాకు వినబడినట్లు సౌలు దిగి వచ్చునా? ఇశ్రాయేలు దేవా, యెహోవా, దయచేసి నీ దాసుడనైన నాకు రూఢిగా తెలియ చేయుము" అని ప్రార్థించాడు.

**(సశేషం)**



# 'పరుగో పరుగో'



'పరుగెత్తి పాలు తాగటం కంటె నిలబడి నీళ్ళు తాగటం మంచిది' అంటారు కదా! పరుగెత్తి పాలు తాగటం, నిలబడి నీళ్ళు తాగటం సంగతేమో కానీ, మనుష్యులందరి జీవితాలు మాత్రం ఉరుకులు పరుగులు మీదనే సాగిపోతుంది. ఉదయం నిద్ర లేచిన దగ్గర్నుండి మళ్ళీ పడుకొనే వరకు క్షణం తీరక లేనంత బిజీగా ఉంటున్నారు. క్షణం తీరిక లేదు దమ్మిడి ఆదాయం లేదన్నట్లు ఈ ఉరుకుల పరుగుల జీవితం ఏం సాధించడానికో ఎవరికీ అర్థం కావడం లేదు. బాగా బతకాలి, సుఖవంతమైన జీవితం జీవించాలన్న తపన మనుష్యులను స్థిమితంగా ఉంచటం లేదు. బాగా బతకాలంటే డబ్బు కావాలి, డబ్బు సంపాదించాలంటే ఉద్యోగమో, వ్యాపారమో చేయాలి. ఉద్యోగం చేయాలంటే చదవుకోవాలి, చదువుకోవాలన్నా డబ్బు కావాలి. వ్యాపారం చేయలన్నా డబ్బు కావాలి. ఉద్యోగం వ్యాపారం చేయలేనోళ్ళు దొంగతనం చేసో, మోసాలు చేసో డబ్బు సంపాదించాలి. ఎలాగైనా డబ్బు సంపాదించాలి కాబట్టి ఈ ధనాపేక్ష మనుష్యులను పరుగులు పెట్టిస్తుంది. సరే, అష్టకష్టాలుపడి, మంచిగానో, చెడుగానో డబ్బు కూడబెట్టుకొని సుఖపడదాము అనుకొనే సరికి వయస్సు పైబడుతుంది, రోగాలు రొష్టులు, సమాధానంలేని జీవితంతో వారు సంపాదించిన డబ్బు దేనికి పనికి రాకుండా పోతుంది. అంటే వారు అనుభవించలేని పరిస్థితుల్లోకి వెళ్తారు. మరేం చేయాలి? ఈ ఉరుకుల పరుగుల జీవితంతో సాధించేదేమిటి? 'సూర్యుని క్రింద నరులు పడుచుండు పాటు అంతటి వలన వారికి కలుగుచున్న లాభమేమి?' (ప్రసంగి 1:3). లాభములేని దానికోసం ఎందుకింత ప్రయాస? ఈ లోకంలో బాగా బ్రతకాలి, సుఖంగా ఉండాలనుకోవడం తప్పా? అనిపిస్తుంది కదా! బాగా బ్రతకటం, సుఖంగా బ్రతకటం తప్పేమి కాదు కానీ, అందుకు మనం ఎంచుకొనే మార్గంవల్లనే మనం అనుభవించలేక పోతున్నాం. ఎవరైనా బిడ్డ పుట్టిన తర్వాత బిడ్డ గురించి ఆలోచించి ప్రణాళికలు వేసుకుంటారు. కానీ, దేవుడు మనిషిని సృష్టించక ముందే మనిషికి అవసరమైనవన్నీ సృష్టించాడు. ఏదీ కొదువ లేకుండా భవిష్యత్తులో ఏమి అవసరమవుతాయో వాటన్నిటినీ మనిషి కోసం సిద్ధం చేసి వుంచాడు. ఐగుప్తు నుండి కనానుకు ఇశ్రాయేలీయులు అరణ్యములో ప్రయాణం చేసిన 40 సంIIలు దేవుడు వారిని పోషించాడు. కనాను దేశములో ప్రవేశించిన తర్వాత వారు కట్టని ఇళ్ళలో నివసించి, వారు పండించని పంటను తిన్నారు. ఇదంతా దేవునితోనే సాధ్యం తప్ప మనిషి తనంతట తానుగా సుఖవంతమైన జీవితం జీవించలేడు. దేవునితో సంబంధం లేని మనుష్యుల జీవితాలు స్థిమితంగా, స్థిరంగా ఉండలేవు. ఆస్తులు సంపాదించుకొని, ఇల్లు కట్టుకొని స్థిరపడ్డామనుకుంటారు కానీ, జీవితం అల్లకల్లోలంగా ఉంటుంది, రోగాలతో, కోర్టు కేసులతో, తగాదాలతో, కుటుంబ సమస్యలతో మనసు నెమ్మదిలేని జీవితం జీవిస్తుంటారు. ఈ మాత్రం దానికేనా మనిషి పరుగెత్తేది. 'దైవదృష్టికి ఇష్టుడగు వానికిచ్చుటకై ప్రయాసపడి పోగుచేయు పనిని ఆయన పాపాత్మునికి నిర్ణయించును' (ప్రసంగి 2:26) అని దేవుడు చెప్తున్నా వినకుండా 'పరుగో పరుగు' అని మీరు పరుగెత్తటం వ్యర్థము, వ్యర్థము. దేవుని యందు భయభక్తులు కలిగి ఆయన మీద ఆధారపడిన వారి జీవితాలు ఉరుకులు పరుగులు లేకుండా స్థిరంగా, స్థిమితంగా జీవిస్తూ, సమృద్ధిగా, సమాధానంగా, సంతోషంగా ఉంటాయి. కాదు కూడదు మేము పరుగెత్తుతామంటారా? అయితే రెడీ, వన్, టూ, త్రీ గో...


**ఫోన్‌పే లేదా గూగుల్ పే ద్వారా పత్రిక చందా పంపవలసిన ఫోన్ నంబరు**

**9 4 4 0 2 1 7 7 2 6**

# యెహోవా నాటిన చెట్లు

ప్రభువైన యేసుక్రీస్తు నామమున మీకు శుభములు. దేవుని పిల్లలకు **"యెహోవా నాటిన చెట్లు"** అని ఆయన వారికి పేరు పెట్టాడు (యెషయా 61:3), బైబిలులో దేవుడు చెట్లకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చాడు. "భూమి గడ్డిని తమ తమ జాతి ప్రకారము తమలో విత్తనములుగల ఫలవృక్షము లను మొలిపింపగా అది మంచిదని దేవుడు చూచెను' (ఆదికాండము 1:12). "మరియు దేవుడైన యెహోవా నరుని నిర్మించి వాని నాసికారంధ్రములో జీవవాయువును ఊదగా నరుడు జీవాత్మ ఆయెను" (ఆదికాండము 2:4) "మరియు దేవుడైన యెహోవా చూపునకు రమ్యమైనదియు ఆహారము నకు మంచిదియునైన ప్రతి వృక్షమును, ఆ తోటమధ్యను జీవవృక్షమును, మంచి చెడ్డల తెలివినిచ్చు వృక్షమును నేల నుండి మొలిపించెను" (ఆదికాండము 2:9). ఒకే నేలనుండి మానవుడిని, చెట్లును దేవుడు చేసాడు. చెట్లు మన ఆత్మీయ ఎదుగుదలకు సాదృశ్యంగా ఉన్నాయి, అందుకే దేవుడు మనకు **"యెహోవా నాటిన చెట్లు"** అని పేరు పెట్టాడు .

ఒక వ్యక్తి రక్షణ పొందిన తరువాత వాని ఆత్మీయ ఎదుగు దలను చెట్టు యొక్క భాగాలతో పోల్చవచ్చును. ఎట్లనగా చెట్ల వేరు మనం దేవునితో గడిపే మౌనధ్యానముకి సాదృశ్యంగా ఉన్నది. ఎలాగైతే వేరు భూమిలో నుండి ఎదగడానికి కావలసిన నీటిని, వనరులను పొందుకుంటుందో, అలాగే విశ్వాసి కూడా రోజు దేవునితో గడిపే ఒంటరి సహవాసంలో ఆత్మీయ ఎదుగు దలకు కావలసిన శక్తిని, దేవుని మాట అనే ఆహారాన్ని, ఆత్మీయ బలమును పొందుకుంటాము. "యెహోవా ధర్మశాస్త్రమునందు ఆనందించుచు, దివారాత్రము దాని ధ్యానించువాడు ధన్యుడు. అతడు నీటికాలువల యోరను నాటబడినదై ఆకు వాడక తన కాలమందు ఫలమిచ్చు చెట్టువలె నుండును" (కీర్తనలు 1:2,3), ఒక చెట్టు యొక్క బలము దాని వేరు మీద ఆధారపడి ఉంటుంది. వేరు ఎంత లోతుగా ఉంటే, బలమైన గాలులకు తుఫానులకు తట్టుకుని నిలబడగలదు. మన జీవితంలో ఆత్మీయ పోరాటములలో, శ్రమలలో మనం నిలబడాలంటే, దేవునితో మన సహవాసం అంత ఎక్కువగా ఉండాలి. దేవుని వాక్యమనే నీటి కొరకు అన్ని దిక్కులకు వ్యాపించాలి. ఆలాగే చెట్టు యొక్క కొమ్మలు చెట్టుతో అంటు కట్టబడి యుండాలి. "నాయందు నిలిచియుండుడి, మీయందు నేనును నిలిచి యుందును. తీగె ద్రాక్షావల్లిలో నిలిచియుంటేనేగాని తనం తట తానే యేలాగు ఫలింపదో ఆలాగే నాయందు నిలిచి యుంటేనేగాని మీరును ఫలింపరు. (యోహాను 15:4) మన ఆత్మ ఫలించాలి. "అయితే ఆత్మ ఫలమేమనగా, ప్రేమ, సంతోషము, సమాధానము, దీర్ఘశాంతము, దయాళుత్వము, మంచి తనము, విశ్వాసము. సాత్వికము, ఆశానిగ్రహము (గలతీ. 5:22). యేసుప్రభువు మన నుండి మంచి ఫలాలను ఆశిస్తు న్నాడు. "ఇప్పుడే గొడ్డలి చెట్ల వేరున ఉంచబడి యున్నది గనుక మంచి ఫలము ఫలించని ప్రతి చెట్టును నరకబడి అగ్నిలో వేయబడును" (మత్తయి 3:10). అలాగే మనలో దేవుని విత్తనము ఉంది. "దేవుని మూలముగా పుట్టిన ప్రతివానిలో ఆయన బీజము నిలుచును గనుక వాడు పాపము చేయ జాలడు" (1యోహాను 3:9).

మనలో నుండి తరములు వచ్చును. మనమంతా మంచి నేలను ఫలించే విత్తనమువలె దేవుని వాక్యమును విని, దానిని అవలంబించి నూరంతలుగా ఫలించాలి. "ప్రభువగు యెహోవా ఆత్మ నా మీదికి వచ్చియున్నది దీనులకు సువర్తమానము ప్రకటించుటకు యెహోవా నన్ను అభిషేకించెను నలిగిన హృదయముగలవారిని దృఢపరచుటకును చెరలో నున్న వారికి విడుదలను బంధింపబడిన వారికి విముక్తిని ప్రకటించుటకును యెహోవా హితవత్సరము మన దేవుని ప్రతిదండన దినమును ప్రకటించుటకు దుఃఖాక్రాంతులందరిని ఓదార్చుటకును సీయోనులో దుఃఖించు వారికి ఉల్లాస వస్త్రములు ధరింప జేయుటకును బూడిదెకు ప్రతిగా పూదండను దుఃఖమునకు ప్రతిగా ఆనంద తైలమును భారభరితమైన ఆత్మకు ప్రతిగా స్తుతివస్త్రమును వారికిచ్చుటకును ఆయన నన్ను పంపి యున్నాడు. యెహోవా తన్ను మహిమపరచుకొనునట్లు నీతి అను మస్తకి వృక్షములనియు **'యెహోవా నాటిన చెట్లనియు'** వారికి పేరు పెట్టబడును. (యెషయా 61:1-3).

మనలోని పరిమళ సువాసన అనేకులకు వ్యాపించును గాక. ఒక చెట్టులోని అన్ని భాగములు ఏలాగు ఉపయోగ పడునో, ఆలాగే మనకు కలిగిన సమస్తము, మన తలాంతులు, మన దేహము, ఆరోగ్యము, ఉద్యోగము, బలము, ధనము, ఘనత, ఆత్మ వరములు అన్ని కూడా దేవుని రాజ్యము కొరకు ఉపయోగపడును గాక! ఆమేన్.

# మధ్యకాలము

క్రీ.పూ. 187 సంIIలో హిర్రైకానస్‌కు అతని తండ్రి ద్వారా లెక్కలేనంత ద్రవ్యము అప్పుగా ఇవ్వబడెను. మరియు అలెగ్జాండ్రియా చేరుకొనిన తరువాత వెయ్యి తులములు లేక రెండువేల పౌండ్లు అప్పుగా ఇవ్వబడెను. ఆ ద్రవ్యములో రాజుకు వందమంది అందమైన బాలురను, రాణికి చాలా మంది అందమైన కన్యకలను ఒక్కొక్కరిని ఒక్కొక్క తలాంతు చొప్పున కొని ఒక్కొక్క తలాంతు వారి చేతులలో ఉంచి మిగిలినవన్నీ ఆ సంస్థానాధిపతులకు గొప్ప అధికారులకు ఇచ్చెను. సుళువుగా తన తండ్రి స్థానమును రాజు రాణి యొద్ద నుండి, యొర్దాను ఆవలనున్న దేశమంతటిపై రాజరికపు శిస్తు వసూలుకై నియమించబడెను.

హిర్రైకానస్ ఆ విధముగా అతనికి ఉన్న ధనాగారమంతటిని దుర్వినియోగపరచిన తర్వాత ఒక బలమైన రక్షకభటునితో కార్యాలయము ఏర్పరచుటకై వెళ్ళుచుండగా అతని సహో దరులను కలుసుకొని వారిలో ఇద్దరిని చంపెను. అతడు యెరూషలేమునకు వచ్చెను. కాని అతని తండ్రి సముఖము నకు వచ్చుటకు అతని తండ్రి నిరాకరించెను.

అతడు అందరిచే నిరాకరించబడెను. త్వరలోనే అతని తండ్రి మరణించిన పిదప, తన తండ్రి భవనంలో ఉన్న సహోదరులను బలవంతముగా త్రోసివేయుటకు పూను కొనెను. అందువలన యెరూషలేము యొక్క సమాధానము తాత్కాలికంగా కదలింపబడెను. చివరికి అతని సోదరులు, ప్రధానయాజకుని ద్వారా, ప్రజల ద్వారా మన్ననలను పొంది వారి సహాయంతో యొర్దాను వైపుకు అతనిని తరిమివేసిరి. అక్కడ ఒక బలమైన దుర్గమందు అతడు నివశించెను. అంతియోకస్ ఎపిఫనెస్ సిరియా దేశపు రాజుగా క్రీ.పూ. 175లో రాజ్యమునకు వచ్చి హిర్కోనస్‌ను భయపెట్టినందున అతడు తనంతట తానే కత్తిపాలై మరణించెను.

ఘనుడగు అంతియోకస్ దేనీమియ వాసులచే చంపబడెను. జ్యూపిటర్ దేవాలయమును కొల్లగొట్టి తన ఒప్పందం ప్రకారం దానిని రోమీయుల కిచ్చుటకై ఒక రాత్రి ప్రేరేపించబడినవాడై దేనీయ వాసులచేత చంపబడెను. ఆ తర్వాత అతని కుమారు డైన సెల్యూకస్ ఫిలోపేటర్ సిరియా, యూదయ దేశములకు రాజుగా అధిష్టించి అంతియొకలో నివశించెను.

సెల్యూకస్ ఈ ప్రాంతములకు రాజైన ప్రారంభ దిన ములలో అతని తండ్రి చేసిన మేలంతటిని యూదులకు చేసెను. అటు తర్వాత బెన్యామీనియుడైన సైమన్ ద్వారా ఆలయంలో గొప్ప ధనాగారమున్నదని తెలుసుకొని దానిని తెచ్చి అంతియొ కయలో ఉంచునట్లు హెలియోడరస్‌ను పంపెను కాని అతడు ఒక దేవదూతల గుంపు పవిత్ర ధనాగారమును సమీపించ కుండా పోరాడుటకై నిలువబడుటను చూచి భయపడుచు మౌనియై నేల వ్రాలెను. ప్రధానయాజకుడు అతని కొరకై దేవునికి విజ్ఞాపన చేయగా తిరిగి మేల్కొనెను.

ఈ హెరియోడరస్ అతని రాజైన సెకిసమ్‌ను రాజ్య కాంక్షతో విషమిచ్చి చంపెను. కాని అంతియోకస్‌కు మరొక కుమారుడైన అంతియోకస్ ఎపిఫనెస్ పెర్గతు రాజైన యూమి నిస్ అతని సోదరుదు అతియాలస్‌ల ద్వారా సిరియారాజుగా నియమించబడ్డాడు. అందువలన హెలియోడరస్ పన్నాగ మంతా నిరర్థకమైనది.

ఎపిఫనెస్ సింహాసన మధిష్టించిన నాటనుండి ప్రజల నుండి అనేక విధాలుగా పన్నులు వసూలు చేయమని రోమీ యులచే ఒత్తిడి చేయబడెను. కనుక అనేక విధాలుగా ప్రజల నుండి ద్రవ్యము వసూలు చేయుచుండెను. అంతేకాక పవిత్రమైన ప్రధానయాజకుడైన ఒనియాస్ యొక్క యాజకత్వ మును సంవత్సరమునకు 360 తలాంతులకు అతని సోదరు డైన జాసన్‌కు అమ్మివేసెను. ఆ తర్వాత జాసన్‌ను కూడా తొలగించి అతని యాజకత్వమును అతని సోదరుడైన మెనిలాస్‌కు మరొక 300 తలాంతులకు అధికంగా అమ్మి వేసెను. ఈ సంఘటన క్రీ.పూ. 174లో జరిగెను.

**(సశేషం)**

# నీ సృష్టికర్త

4

*"దేవుడైన యెహోవా నేల మంటితో నరుని నిర్మించి వాని నాసికారంధ్రములలో జీవవాయువును ఊదగా నరుడు జీవాత్మ ఆయెను" ఆది 2:7*

మనలో జీవము ప్రవేశించినది దేవుడు జీవవాయువును ఊదటం వలన. ఆ జీవవాయువు మానవుని నాశికము ద్వారా ప్రవేశించి శరీరములోని అన్ని అవయవములకు జీవమును ఇచ్చి మానవ శరీరమునకు జీవమును కలిగించింది.

మానవ శరీరం జీవము కలిగి ఉండాలి అంటే వాయువు మన శరీరంలోకి వెళ్ళాలి. దానినే మనం ఊపిరి అంటున్నాం. ఊపిరి తీసుకోవడమే మనం బ్రతికి ఉన్నాము అని నిర్ణయించు ముఖ్య ప్రమాణం.

మనం వాతావరణంలో ఉన్న గాలిని మన ముక్కు రంధ్రాల ద్వారా శరీరములోకి పీల్చుకుంటాము. అయితే వాతావరణంలో ఉన్న గాలిలో ఉండే ఆక్సిజన్ మానవ శరీరమునకు, శరీర భాగాలు జీవము కలిగి ఉండుటకు అవసరమైన ముఖ్య మూలకం. కాబట్టి మనం ఊపిరి పీల్చుకున్న ప్రతిసారి మన శరీరమునకు అవసరమైన ఆక్సిజన్‌ను తీసుకుంటాం.

అయితే శ్వాస తీసుకోవడం లేదా గాలిని పీల్చడంతో మన శరీరానికి అవసరమైన ఆక్సిజన్ శరీర భాగాలకి అందదు. ఎందుకంటే మనం పీల్చుకునే గాలిలో మనకు కావలసిన ఆక్సిజన్ మాత్రమే కాక మన శరీరానికి అవసరం లేని అనేక పదార్థాలు ఉంటాయి. అంతే కాదు మనకు కావలసిన ఆక్సిజన్ మన శరీరము వాడుకోదగిన స్థితిలో ఉండదు కాబట్టి ముక్కు ద్వారా తీసుకున్న ఊపిరి ని మానవ శరీర వ్యవస్థకు తగునట్లు, మార్చుటకు నిర్మించబడిన వ్యవస్థే **శ్వాసవ్యవస్థ.**

శ్వాసవ్యవస్థలో ముఖ్య భాగం ఊపిరితిత్తులు. ఈ ఊపిరితిత్తులు మానవ శరీరంలో చాలా కీలకమైన అవయవము మరియు చాలా తేలికైన మానవ శరీర భాగమని చెప్పవచ్చు

బయట వాతావరణం నుండి తీసుకోబడిన గాలిలో ఉండే వ్యర్థాలు ముక్కు రంధ్రాలలో శుద్ధీకరించబడి, ఫిల్టర్ చేయబడి వాయునాళంలోకి చేరుకుంటుంది. వాయు నాళంలో గాలి యొక్క ఉష్ణోగ్రత పెంచబడుతుంది. అంటే వాయునాళంలో చేరిన గాలి మన శరీర ఉష్ణోగ్రతకు తగిన విధంగా మార్చబడుతుంది. అంతే కాక గాలికి కొంత తేమను కూడ చేర్చడం జరుగుతుంది. ఒకవేళ మనం పీల్చుకునే గాలికి తేమను జత చేయకపోతే ఆ గాలి మన ఊపిరితిత్తులలో ఉండే తేమను మొత్తం పీల్చుకొని ఊపరి తిత్తులను ఎండి పోజేస్తుంది. అంటే ఊపిరి తిత్తులకు చేరే గాలి మన శరీర ఉష్ణోగ్రతకు తగిన విధంగాను తేమ కలిగి ఉంటుంది. అలా ఊపిరితిత్తులకు చేరిన గాలి వాయుకోశాల ద్వారా గుత్తులు గుత్తులుగా ఉండే గాలి సంచుల వంటి భాగాలకు చేరుతుంది. ఈ గాలిసంచులు గాలిలోని ఆక్సిజన్‌ను తమకు అతి సమీపంలో ఉన్న రక్తనాళాలకు అందిస్తాయి.

ఈ మొత్తం ప్రక్రియను శ్వాసతీసుకోవడం అంటాము. అలాగే ఊపిరితిత్తులలోని గాలి సంచులు రక్తనాళాల రక్తంలో ఉండే కార్బన్‌డైయాక్సైడ్‌ను సంగ్రహించి దానిని వాయు కోశాల ద్వారా వాయునాళానికి అక్కడ నుండి ముక్కు ద్వారా బయట వాతావరణానికి పంపివేస్తాయి. దీనిని నిశ్వాస లేదా గాలిని వదలడం అంటాము. ఈ రెండు ప్రక్రియలను కలిపి శ్వాసక్రియ అంటాము.

ఊపిరితిత్తులకు రక్షణగా ప్రక్కటెముకలు ఆవరించి ఉంటాయి. పొట్టభాగానికి రొమ్ముభాగానికి మధ్య ఉండే కండరం యొక్క కదిలికకు అనుగుణం ప్రక్కటెముకలు ముందుకు వెనకకు కదలుతాయి. ఫలితంగా ప్రక్క టెముకలలో ఉండే ఊపిరితిత్తులకు వ్యాకోచించుటకు

వీలవుతుంది. అంటే మనం శ్వాస తీసుకున్నప్పుడు మన ఊపిరితిత్తులు వ్యాకోచిస్తాయి లేదా పెద్దగా అవుతాయి. మనం ఊపిరి బయటకు వదలగానే ప్రక్కటెముకలు వెనకు కదులుతాయి ఫలితంగా ఊపిరితిత్తులు సంకోచిస్తాయి.

మనకు ఏమాత్రం తెలియకుండానే నిరంతరం మనం నిద్రించేటప్పుడు కూడా శ్వాసక్రియ కొనసాగుతుంటుంది. మనకు తెలియకుండానే మనం ఒకరోజుకు 22,000 సార్లు శ్వాసతీసుకుంటాం.

ఆరోగ్యవంతమైన మానవ శరీరం ఒక నిమిషంలో దాదాపు 6లీటర్లకంటే ఎక్కువ గాలిని పీలుస్తుందట

మానవ శరీర అవయవాలలో ఊపిరితిత్తులు మాత్రమే నీటిమీద తేలియాడగలవు. ఊపిరితిత్తులలో ఉండే గాలి సంచుల వంటి నిర్మాణమే దీనికి కారణం. సరాసరిన 4800 లక్షల గాలిసంచుల వంటి నిర్మాణాలు మానవ ఊపిరితిత్తులలో ఉంటాయి.

ఎడమ వైపు గుండె ఉండటం వలన ఎడమ ఊపిరితిత్తి కుడి ఊపిరితిత్తి కంటే కొంచెం చిన్నదిగా ఉంటుంది.

వాయునాళంలో ఉండే ఒక పెట్టే వంటి ఆకారాన్ని స్వరపేటిక అంటారు. స్వరపేటికలో ఉండే సన్నని తంత్రుల వంటి నాళాల ద్వారానే మనం మాట్లాడగలుగుతాము అయితే కేవలం ఊపిరి బయటకు వదిలే ప్రక్రియలోనే మనం ఈ పేటిక ద్వారా శబ్ధాలను పుట్టించగలం. అంటే మాట్లాడగలము.

వాస్తవానికి ఊపిరితిత్తులు తమ పూర్తి సామర్థ్యానికి ఊపిరిని తీసుకుంటే వాటి వైశాల్యం 80 చదరపు మీటర్లు అంటే దాదాపు టెన్నిస్ కోర్టంత ఉంటుందట.

మన శరీరంలోనే మనకు తెలియకుండ ఎంత పెద్ద వ్యవస్థ నడుస్తుందో. మన ప్రమేయం ఏమి లేకుండానే అత్యంత సమర్థవంతంగా పనిచేయగలిగే అవయవ వ్యవస్థను దేవుడు మనకిచ్చాడు. దేవుడిచ్చిన వాటిని అధ్యయనం చేయడానికి మనిషికి ఇంత కాలం పట్టింది. ఆ అధ్యయనం కూడా పూర్తిగా అని చెప్పలేము మానవుని జ్ఞానం దేవుని సృష్టి ముందే వెలవెలబోతుంటే ఇక దేవుని ముందు మనిషి ఎంత? మనిషి విలువ ఎంత?

దేవుడిచ్చిన ఊపిరి ఆగకమునుపే మన నిజస్థితిని గ్రహించినవారమై దేవుని పాదసన్నిధిలో మన జీవన (శారీరిక, మానససిక, అధ్యాత్మిక) విధానాన్ని మార్చుకొని నిజమైన ఆరోగ్యవంతులుగా జీవిద్దాం.

## చందాదారుల వివరములు

1. రెవ.డా॥ వి. విజయకుమార్, బొబ్బిలి - 5000/-
2. మేరిసలోమి, సిరివెళ్ళ, కర్నూలుజిల్లా 5000/-
3. శ్రీమతి వై. సంధ్యారాణి, ఒంగోలు - 2000/-
4. అపొ. ఎబినేజర్‌గారు (హైదరాబాద్)-1500 (నెలకు)
5. డా॥ సిహెచ్‌కె. సుష్మ ప్రశాంత్, నెల్లూరు - 1500/-
6. జయ, గుంటూరు (6-3-24)- 1500/-
7. గంధం దేవిడ్ నీలకాంత్ (నెల్లూరు) -1000
8. కె. రజిని, నరసరావుపేట - 1000/-
9. వి. కస్తూరి, భీమవరం 500/-
10. శ్రీమతి శాంతాగ్రేస్, మచిలీపట్నం 500/-
11. పి.వి.రెడ్డి, ఒంగోలు - 500/-
12. బి. నెహెమ్యా, చిన్నగంజాం - 500/-
13. నైటింగేల్, నెల్లూరు - 500/-
14. మారనాత బైబిల్ సెమినరీ, విజయవాడ - 500/-
15. డి. శ్యామ్‌సిన్హా, బాపట్ల - 500/-
16. వి. రత్నమ్మ, హైదరాబాద్ 350/-
17. జి. కళావతి, ఒంగోలు 350/-
18. శ్రీమతి కె. కల్పన, గోవా - 350/-
19. శ్రీ జి. వెంకటేశ్వర్లు, కొత్తపల్లి - 350/-
20. సి.హెచ్.స్వయంప్రభ, చిలకలూరిపేట(18-3-24)350/-
21. కె. రాజేష్, రాజమండ్రి - 350/-
22. శ్రీ యస్. గోపి, పార్వతిపురం - 350/-
23. పి. దేవదానం, గుంటూరు - 300/-
24. పి. యేసుబాబు లోకేష్, చింతలపూడి - 200/-
25. ఆర్. ఇన్నయ్య, గుంతకల్ - 200/-
26. టి. క్రిస్టియానమ్మ, నందికొట్కూరు - 350/-
27. జి. జార్జిథామస్, దుగ్గిరాల - 500/-
28. టి.యం. భగవాన్‌దాస్, కదిరి (7-3-24) - 350/-
29. కె. విజయకుమార్, ఒంగోలు (1-3-24) 350/-

సాక్ష్యము

# ప్రార్థన ఆలకించువాడు

కొన్ని సంవత్సరాల క్రితం నా పెద్ద కుమార్తెకు పాంక్రియాటైటిస్ అనే జబ్బు చేసి ఒక పెద్ద కార్పొరేట్ ఆసుపత్రిలో అడ్మిట్ చేశాము. 23 రోజులు ఐ.సి.యులో ఉంచేంత పెద్ద జబ్బు అది. విపరీతమైన అంటే భరించ లేనంత కడుపునొప్పి, జీర్ణవ్యవస్థ అస్తవ్యస్తం కావడం ఈ జబ్బు యొక్క లక్షణాలు. తీవ్రమైన వేదనతో హాస్పిటల్ గడిపిన దినాలు. అప్పటికే మా గురువుగారైన రాజేంద్ర గారితో ఆత్మీయంగా ఉండేవాడ్ని. ఆ సమయంలో ఆయనకు ఫోన్ చేసి సార్! పెద్దమ్మాయి ఆరోగ్యం పరిస్థితి ఇలా వుంది, నాకు చాలా వేదనకరంగా ఉంది, ఇప్పుడెలా సార్ అన్నప్పుడు, విశ్వాసి అయిన ఆయన ఏమయ్యా! యేసు ప్రభువు స్వస్థపరుస్తాడు అన్న విషయం నీకు తెలియదా? అన్నప్పుడు నాలో కలిగిన ధైర్యం అంతా ఇంతా కాదు. బైబిల్‌లో స్వస్థత గురించిన అంశాలు నాకు ఎన్నో గుర్తుకు వచ్చాయి. గతంలో వారందరినీ స్వస్థపరిచిన దేవుడే కదా! ఇప్పుడూ మనకు ఉండేది అన్న నమ్మకం కలిగి నప్పుడు ప్రభువు నా కూతుర్ని కూడా స్వస్థపరుస్తాడు అని నిర్ధారించు కొని విశ్వాసంతో ప్రార్థించడం జరిగింది. పదవ తరగతి చదివే నా కుమార్తె కొన్ని సందర్భాల్లో కనీసం నడిచే పరిస్థితి లేదు. ఈ విషయం ఈ పత్రికా ఎడిటర్‌గారు స్వయంగా మా కుటుంబాన్ని సందర్శించి తెలుసుకోవడం అప్పట్నుంచి తరచుగా మా గ్రామాన్ని, కుటుంబాన్ని దర్శించి ప్రార్థించే వారు. క్రమేపీ బిడ్డ నడవడం గమనించిన ఎడిటర్ గారు దేవుడు చేసిన అద్భుతకార్యం నా జీవితంలో జరగడాన్ని గురించి నాకు వివరించినప్పుడు ఆ ప్రభువు కనుదృష్టి నా మీద కూడా ఉన్నదని గమనించి ఇతరుల గురించి ప్రార్థించడం మొదలుపెట్టాను.

ఒకసారి ప్రార్థనలో ఎన్నడూ అడగని నేను నాకు ఒక సొంత ఇల్లు కావాలని ప్రార్థించడం జరిగింది. ప్రార్థన ముగిసిన ఒక అరగంటలోపే నా భార్య దగ్గర్నుంచి నాకు ఫోన్ వచ్చింది. ఏవండీ! ఇంటి ఓనర్ వచ్చాడు. ఇల్లు ఖాళీ చెయ్యమన్నాడు అని. నాకేం అర్థం కాలేదు ఏందబ్బా బాడుగ విషయమా? బాడుగ తప్పకుండా మొదటి వారంలోనే చెల్లిస్తా. మరేంటి ప్రభువా? ఏంది నాయనా ఇది అడక్క అడక్క ఇల్లు కవాలాని అడిగితే ఇల్లు ఖాళీ చెయ్యమనేలా చేశావు. ఏంది నాయనా ఇది? అని ఆలోచించినప్పుడు దయగల తండ్రి నాకు అలా ఎందుకు చేస్తాడు? అయినా ఎప్పుడూ లేనిది నేను ప్రార్థించిన వెంటనే ఇల్లు ఖాళీ చెయ్య మన్నాడు అంటే ప్రభువు నా మాట ఆలకించినట్లే కదా! వెనకడుగు వేయలేదు, ప్రభువు అదే అద్దెకు మరో బ్రహ్మాండమైన ఇంటిని నా కొరకు సిద్ధపరచియున్నాడు. దేవునికి స్తోత్రం! ఆయనకు అసాధ్యమైనది ఏమైనా ఉన్నదా? మనం కొన్ని విషయాలలో విజయం సాధిస్తే పొంగిపోతాం. అదే ఓడిపోతే కుమిలిపోతాం కానీ అంతా ఆ ప్రభువు చిత్తమే అని నమ్మినప్పుడు హృదయం ఎంత తేలికవుతుందో తెలుసుకోగలిగి కొందరికి తెలియపచడం కూడా జరిగింది. నేను బయటకు వెళ్ళడం కాదు నా దగ్గరకే ప్రభువు కొంత మందిని పంపిస్తూవుండడం నాకు ఆశ్చర్యాన్ని కల్గిస్తుంది. వారి వారి పరిస్థితిని తెలిపి ప్రార్థనా సహాయాన్ని నా నుండి కోరుకుంటున్నారు. ఇవన్ని ఆలోచించినపుడు నా జీవితాన్ని ఇన్ని సంవత్సరాలు ఎలా వృధా చేసుకున్నాను అని బాధ కూడా కలుగుతుంది.

ఇటీవల కాలంలో నా మేనల్లుడు ప్రదీప్ (బద్వేల్) ఒక పెద్ద ప్రమాదానికి గురయ్యాడు. ఎంత పెద్ద ప్రమాదం అంటే ఆ ప్రమాదం జరిగిన ప్రాంతంలో కొన్ని రోజులవరకు ఆ రక్తపు మడుగు మరకలు రోడ్డు పైన అలాగే ఉన్నాయి. పగిలిపోయిన హెల్మెట్ అయితే ఇప్పటికీ అక్కడే ఉంది. అర్ధరాత్రి పూట మా బావగార్ని ఫోన్ చేసి అడిగాను. బావా! డాక్టర్స్ ఏమంటున్నారు? పరిస్థితి ఎలా ఉంది? అని

**(మిగతాది 21వ పేజిలో)**

## STATEMENT ABOUT OWNERSHIP AND OTHER PARTICULARS OF HANNA KRUPA MONTHLY

| | | | |
|---|---|---|---|
| 1. | Place of Publication | : | ONGOLE |
| 2. | Periodicity of its Publication | : | Monthly |
| 3. | Printer's Name | : | K. E. Rajendra |
| | (Whether Citizen of India) | : | Indian |
| | Country of Origion/Address | : | 5th Lane, Cloughpet, Ongole - 523 001 |
| 4. | Publisher's Name | : | K. Emmanial Rajendra |
| | (Whether Citizen of India) | : | Indian |
| | Country of Origion/Address | : | Krupadanam Street, Cloughpet, Ongole - 523 001 |
| 5. | Editor's Name | : | K. Emmanial Rajendra |
| | (Whether Citizen of India) | : | Indian |
| | Country of Origion/Address | : | Krupadanam Street, Cloughpet, Ongole - 523 001 |

I, K. Emmanial Rajendra here by declares that the particulars given above are true to the best of my knowledge and belief.

Date : 18-03-2024

(Sd.) ***K. Emmanial Rajendra***
Signature of the Publisher


## ఇంటర్నెట్‌లో తెలుగు బైబిల్

మీరు ఎక్కడున్నా సరే, మీ స్మార్ట్ ఫోన్, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్‌లలో తెలుగు బైబిల్ చూడవచ్చును. అంతేకాక తెలుగు–ఇంగ్లీషు ప్యారలల్ బైబిల్, తెలుగు ఆడియో బైబిల్, తెలుగు బైబిల్ ఎన్‌సైక్లోపీడియా, తెలుగు ఆడియో, వీడియో పాటలు, తెలుగు పాటల రచనలు, అద్భుత సాక్ష్యములు, బైబిల్ వాల్‌పేపర్స్, తెలుగు క్రైస్తవ పుస్తకములు ఇంకా మరెన్నో మీ కోసం... నేడే దర్శించండి...

**www.onlinetelugubible.net**

ఆధునిక దృక్పథం

# క్రొత్త కోణాలు

## 3. తప్పిపోయిన కుమారు‘లు’

**యేసు చెప్పిన 68 ఉపమానాల్లో ‘తప్పిపోయిన కుమారుడు’ అనే ‘డు’ అంతమైనది చిన్నబిడ్డలు మొదలు జనబాహుళ్యానికి సుపరిచితమైనది. ఒకరు తండ్రి యొద్ద తన ఆస్థి వాటాను తీసుకొని, తండ్రికి దూరమై, దుష్టసాంగత్యాలతో సమస్తం కోల్పోయి, పందుల పొట్టు తినాల్సిన గతిపట్టింది, కనుక అలా కావద్దు అనే నీతి కథగా మత ప్రమేయం లేకుండ అందరూ చెప్పుకొనేది. అయితే, యిదికేవలం ఒక లౌకిక నీతికథేకాదు. పరలోకతండ్రి (దేవుడు) మారుమనస్సు పొందిన పాపిపై చూపే కనికరాన్ని, క్షమాభిక్షను; దానితోపాటు తండ్రియొద్దనే ఉంటూ తప్పిపోయి తిరిగి వచ్చిన తన తోడబుట్టువు యెడల కాఠిన్యత చూపుట ద్వారా తప్పిపోయిన పెద్ద కుమారుని కలిపి జంటగా ‘తప్పిపోయిన కుమారులు’ అనే ‘లు’ అంతపు ఉపమానంగా క్రొత్తకోణాల్లో అధ్యయనం చేద్దాం.**

ఈ ఉపమానాన్ని ఇంగ్లీషులో ‘ది ప్రాడిగల్ సన్’ అని పిలుస్తారు. ఈ మాట బైబుల్లోని ఆ కథలో లేదు. అతడు చేసిన దుబారా పనుల (15:14,15,30)ను బట్టి ‘దుబారా కుమారు’డన్నారు. తెలుగులో మనముపయోగించే ‘తప్పి పోయిన’ అనే బిరుదు కనీసం బైబుల్లోని మాట (వ.24,32)ను బట్టి ఉంది. ఈ ఉపమానం లూకా సువార్తలో మాత్రమే ఉంది (15:11-32). ఈ 22 వచనాలు ఒకే వ్యాసభాగంగా ఉందని గ్రహించాలి. వ11-24లలో చిన్న కుమారుని సంగతి, 25-32లలో పెద్దకుమారుని సంగతి అవిభాజ్యంగా ఉన్నట్లు గమనించాలి. దీన్ని మన బోధకులు రెండు తునకలు చేసి మొదటి భాగాన్ని మాత్రమే లెస్సగా ప్రసంగిస్తుంటారు. అయితే, యేసు ఈ కథను చెప్పటంలో అతి ముఖ్యంగా రెండవ భాగాన్ని చెప్పినట్లు ఈ కథ చెప్పిన సంధర్భం బయలు పరస్తుంది.

యేసు, ఈ కథ చెప్పటానికి సందర్భం, ప్రేరకం, 15:1,2; ‘ఒకప్పుడు సమస్తమైన సుంకరులును పాపులును ఆయన బోధ వినుటకు ఆయన దగ్గరకు వచ్చుచుండగా పరిసయ్యు లును శాస్త్రులును అది చూచి, ఇతడు పాపులను చేర్చుకొని వారితో భోజనము చేయుచున్నాడని సణగుకొనిరి’. ఆ సణుగు నకు ప్రత్యుత్తరంగా యేసు మరి రెండు ఉపమానాలు కూడ చెప్పాడు : తప్పిపోయి దొరికిన గొఱ్ఱె కథ, పోయి దొరికిన నాణెము కథ (15:3-7; 8-10). ఆ తరువాత తప్పిపోయిన కుమారుల కథ (15:11-32). ఈ మూడింటిలో కథానాయ కులు గొఱ్ఱె, నాణెము, కుమారులనుకొంటామేమో! కాని, సరిగా పరీక్షిస్తే, పోగొట్టుకొనిన మనుష్యుడు (గొఱ్ఱెల కాపరి), పోగొట్టుకొనిన స్త్రీ, కుమారులు దూరమైన ఒక తండ్రి. పోగొట్టుకొనబడినవి సుంకరులకు, పాపులకు, ఆశ్చర్యకరంగా పరిసయ్యులు, శాస్త్రులకు సహితం సాదృశ్యాలు కాగా; పోగొట్టుకొనినవాడు పరలోకపు తండ్రికి సాదృశ్యమై యున్నాడు. ఈ క్రొత్తకోణాల్లో పరిసయ్యుల సరి ఉజ్జీలెవరో చూడండి!

ఈ వ్యాసంలోని ప్రధానాంశమైన ‘తప్పిపోయిన కుమా రుల’ విషయానికొద్దాం. అందు చిన్నవాడు తిరిగి చెడిపోతే, పెద్దవాడు తిరగకయే చెడిపోయాడు. ఒకడు తప్పిపోయి దొరికితే, మరొకడు దొరికి (ఇంటిపట్టునే యుండి) కూడ తప్పిపోయాడు. ఒకడు చచ్చి బ్రతికితే, మరొకడు బ్రతుకుచూ చచ్చిన వాడయ్యాడు. ఒకడు తండ్రికి దూరమై చేరువకు వస్తే, మరొకడు చేరువలో ఉండి కూడ దూరస్థుడయ్యాడు. కనుక, యేసు ఈ కథను చెప్పింది ‘పాపులనబడే పాపులకు, సుంకరు లకు, పరిశుద్ధులమనుకొనే పరిసయ్యులకు శాస్త్రులకు (నేటి క్రైస్తవ నాయకులకు, బోధకులకు, విశ్వాసులకు) ఏ తారత మ్యమూ లేదనే విషయాన్ని కొట్ట వచ్చినట్లు స్వయం విశదం కావాలనే గాని, కేవలం ఒక లౌకిక నైతిక అంశాన్ని మాత్రమే బోధించటానికి కాదు!

ఇందున్న అగమ్యగోచర విషాదమేమంటే – పరిసయ్యులు, – శాస్త్రులు, తమ వంశానుక్రమత (అబ్రాహాము సంతాన హోదా)నుబట్టి, యెరూషలేము దేవాలయ సేవ, అర్చనల (గుడులకు పోవటం)ను బట్టి, వారు పుట్టుకతోనే పరిశుద్ధులు,

పవిత్రులని, అలా చేయని, లేక అబ్రాహాము (క్రైస్తవ) కుటుంబాలకు చెందని వారంతా పాపులు, సుంకరులు అని భావించటం. రెండవదిగా, యూదుడు, సదాచారి, రబ్బీ, ధర్మ శాస్త్రాది లేఖనాల్లో నిష్ణాణత గలవానిగా బయలు వెడలుతున్న యేసు తమలో ఒకడుగా ఉండాల్సిన దానికి బదులు, తాము చేస్తున్నట్లే పాపుల్ని, సుంకరుల్ని ఆమడంత దూరముంచడానికి బదులు, వారితో కలసి భోజనం చేయటమనేది వారు జీర్ణించుకోలేని యధార్థం. మూడవదిగా, యేసుయొక్క, అనగా, క్రొత్త నిబంధనగా ఆయన స్థాపించనున్న క్రొత్తలోకం, క్రొత్తబోధలను మచ్చుకైనా ఊహింకోలేని సనాతనుల తికమకలు. మచ్చుకు, యేసు దృష్టిలో 'పాపము చేయనివాడు ఒకడును లేడు' (1రాజు. 8:40) అనే పాత నిబంధనా సత్యం ప్రతిఒక్క మానవునికి వర్తిస్తుందని, తాను దివి నుండి భువికి వచ్చింది పాపులను వెదకి రక్షించడానికని, ఈ రక్షణ ధర్మశాస్త్రంలోని పశుపక్ష్యాది పాపపరిహారార్థ బలుల్లో లేదని, కనుక వాటిని నమ్మి ఆచరించే పరిసయ్యులకు యధాతంగా రక్షణ లేనేలేదని... బల్లలు తల్లక్రిందులయ్యే పరమార్థం!

అందువలన అక్రమబద్ధ పరిశుద్ధులైన పరిసయ్యులు శాస్త్రులు, క్రమబద్ధ పరిశుద్ధుడైన యేసును అక్రమస్థుడని సణుగుతున్నారు! పచ్చరంగు అద్దాలు పెట్టుకొన్న వారికి అంతా పచ్చగానే ఉంటుంది! ఈ నేపథ్యంలో, యేసు తప్పిపోయిన కుమారుల ఉపమానం చెప్పాడని మొదట గమనించాలి. ఏదైనా ఉపమానాన్ని దాని చారిత్రాత్మక సందర్భానుసారంగా గ్రహించకపోతే అందలి సంపూర్ణ సత్యం బోధపడదు.

## తప్పిపోయిన చిన్నకుమారుడు

ఉపమానంలోని తండ్రికి ఇద్దరు కుమారులున్నట్లు దేవుని సృష్టిలో కూడ రెండు రకాల ప్రజలున్నారు. కొందరు తండ్రిని కనిపెట్టుకొని ఉండేవారు, మరికొందరు తండ్రి నుండి స్వయిష్టానుసారంగా తమ స్వాస్థ్యాన్ని తీసికొని విడిపోయేవారు. ఈ రెండవ రకంవారు తండ్రికి దూరం అవటంలో ప్రమాదం లేదు కాని తండ్రితో తెగతెంపులు చేసుకొనటంలోనే ప్రమాదం. అంటే, ఆయన కట్టడలను నిర్లక్షించటం తద్వారా దుర్వ్యసనాలు, దుస్సాంగత్యాలు, దుర్వ్యయాలు.... చివరకు దుడ్డుదుగ్గాణి లేని దౌర్భాగ్యస్థితి.... మరీ చివరకు పందుల పొట్టు తినాల్సిన మానవాధమ (dehumanised) స్థితికి దిగజారటం.

ఏలానైతేనేం అతనికి మారుమనస్సు కలిగింది! అన్ని వేళలా బోధకుల, సువార్తికుల, పెద్దల ద్వారానే కాదు. మానవునిలో అంతర్నివాసి అయిన అంతరాత్మ (పరిశుద్ధాత్మ) ప్రబోధంచేత కూడా మారుమనస్సు కలుగుతుంది. కలిగిందే తడవుగా తండ్రి దిశలో పయనం సాగించాడు.

కథానాయకుడైన తండ్రి అతణ్ణి అల్లంత దూరంలోనే చూచాడు. ఎదురు పరుగెత్తాడు. పాపపు కంపు ఇంకా పోని కొడుకు మెడమీద పడ్డాడు. కొడుకు క్షమాపణ చెప్పకముందే క్షమించాడు (వ.20,21). మరలా అతణ్ణి తన కుమారస్థితికి హెచ్చిస్తూ ప్రశస్థ వస్త్రాలు, ఉంగరం, (ఆది. 41:42, 1రాజు. 21:8) తొడిగాడు, (సాతాను) బానిసత్వం నుండి దేవుని స్వాతంత్ర్యానికి హెచ్చిస్తూ చెప్పులు తొడిగించాడు (యెష, 20:2), విందులు వినోదాలతో ఇల్లంతటినీ ఉత్సవ సంబరాలతో సంతోషించ మొదలుపెట్టాడు.

ఈ కథా భాగానికి ముగింపు, 99 మంది నీతిమంతుల విషయమై కలుగు సంతోషం కంటే, మారుమనస్సు పొందు ఒక్క పాపి విషయమై పరలోకమందు దేవుని దూతల ఎదుట ఎక్కువ సంతోషము కలుగుతుందని అంతకుముందే చెప్పిన తప్పిపోయిన గొఱ్ఱె (3-7), పోగొట్టుకొన్న నాణెము(8-10)ల విషయంలో చెప్పిన విషయమే తప్పిపోయి తిరిగి రాగా దొరికిన చిన్నకుమారుని విషయంలో చెప్పకయే చెప్పినట్లయింది.

## తప్పిపోయిన పెద్ద కుమారుడు

పెద్ద కుమారుడు ఇంటివద్ద తండ్రితోనే ఉన్నాడు. తండ్రికి పొలంపనుల్లో సహాయం చేస్తున్నాడు. ఈ పనులన్నీ పరిసయ్యులు, యాజకులు చేసే దేవునికి సంబంధించిన పనులే. సువార్త సేవ మనం పొలం పనికి పోలుస్తుంటాము. అతడు ఇంటికి వచ్చేసరికి ఇల్లంతా ధూంధాంగా ఉంది. ఒక సేవకుణ్ణడిగి తెలుసుకున్నాడు: తిరుగుబోతు తమ్ముడు తిరిగి వచ్చాడని, ఈ హంగామా అంతా అందుకోసమేనని. ఇక అతనికి ఇంట్లో ప్రవేశించటానిక్కూడా మనసు రానంత ఆగ్రహం వచ్చింది. బయటనున్న అతణ్ణి లోనికి రమ్మని తండ్రే పిలిచాడు. అయితే, కోపంతో రెండుతలల పాములా బుసకొట్టాడు. ఒకవైపు తాను తండ్రికి విధేయుడుగా ఉన్నట్లు 'స్వనీతి' బుస

కన్నుమనింది. రెండో వైపు, 'ఆస్థిని వేశ్యలతో తినివేసిన' ఈ నీకుమారుని కోసం ఇంత పెద్ద ఆర్భాటమా అని అసూయ ద్వేషాలు విషంకక్కే బుస. తన తోడబుట్టువుని తమ్ముడనటాని క్కూడ నోరురాని ఆ పెద్ద కుమారుడు ఆనాటి పరిసయ్యులకు, ఈనాడు దేవుడు వరమిచ్చినా తాము వరమియ్యని పూజారులైన కొందరు బోధకులకు స్వనీతిపరులైన విశ్వాసులకు స్వనీతి పరులకు సాదృశ్యం. అందుకే ఈ రెండో భాగాన్ని అంతగా వివరించి బోధించుట!

బాహ్యంగా, తండ్రి పనులు చేసినంతమాత్రాన చాలదు. తండ్రి మనస్సును, చిత్తాన్ని కూడ చేయాలి. తండ్రికి లోబడినట్లే ఉన్నాడు. కాని, అంతరంగంలో తండ్రికోరే గుణాలులేవు. పెద్ద కుమారుని తప్పేదో తండ్రి ఎత్తిచూపలేదు. అయితే 'మనము సంతోషపడి ఆనందించుట యుక్తమే, ఈ నీ తమ్ముడు. చనిపోయి తిరిగి బ్రదికెను, తప్పిపోయి దొరకెన'ని తండ్రి చెప్పాడు. (వ32). ఆ వారింపు మూడో సహస్రాబ్దికి మనకు కనువిప్పు కావాలి!

తన సోదరుని స్వీకరించటానికి గాని, అతనికి తమ తండ్రి ఇచ్చిన గుర్తింపును ఓర్వటానికి గాని అడ్డుపడే అసూయ ద్వేషాలను ప్రదర్శించి పెద్దకుమారుడు మరీ తప్పిపోయాడు. చిన్న కుమారుడు బాహ్యంగా కనిపించే పాపాలు చేసి తప్పిపోయాడు. పెద్దకుమారుడు ఆంతరంగికంగా పాపాలు చేస్తూ తప్పిపోయాడు. తండ్రికి ఆనంద కారణం తప్పిపోయినా సరే తిరిగి దొరకటం, మారుమనస్సు దానికొకే ఒక మార్గం. మారుమనస్సు, బాప్తిస్మాలు విశ్వాసుల రక్షణకు మొదటి మెట్లు, కాగా రక్షణానందానికి స్వనీతిని, స్వాతిశయాన్ని, రహస్య పాపాలను సహితం త్యజించి క్రీస్తునందు ఎదగటం, పరలోకానికి, నిత్యజీవానికి నిచ్చెన మెట్లు.

ఎంతపాపినైనను - యేసు చేర్చుకొనును
అంచు సువార్తను - అంతటc జాటించుడి
హల్లెలూయ, హల్లెలూయ - ఎంత పాపినైననూ
యేసు చేర్చుకొనున - టంచుc బ్రకటించుడి (యోహా. 6:37) పరిసయ్యులు, నేటి క్రైస్తవులు గుర్తెరగాల్సిన సత్యాన్ని తప్పిపోయిన కుమారుల సాదృశ్యం తెలిపే సత్యం,

**వచ్చే మాసం: పదిమంది కన్యకలు**


## కొడవటికంటిగారి రచనలు

| | | |
|---|---|---|
| 1. | మడిమెను పట్టుకొనినవాడు | రూ. 40 |
| 2. | ఆసెనతు | రూ. 150 |
| 3. | అపొస్తలుడు | రూ. 250 |
| 4. | నా చిత్తానుసారుడు | రూ. 110 |
| 5. | గుంట నుండి మింటికి | రూ. 50 |
| 6. | విశ్వాసంలో ఓ మెట్టు | రూ. 60 |
| 7. | విశ్వాసంలో మరో మెట్టు | రూ. 65 |
| 8. | తోటలో పనివాడు | రూ. 20 |
| 9. | గోత్రకర్త (యాకోబు) | రూ. 50 |
| 10. | నా కుటుంబము | రూ. 25 |
| 11. | నా దూత (బాప్తిస్మమిచ్చు యోహాను) | రూ. 50 |
| 12. | నా కుమారి (రూతు) | రూ. 60 |
| 13. | నా స్నేహితుడు | రూ. 50 |
| 14. | అంత్యదినములలోని యధార్ధ ప్రవక్త | రూ. 50 |
| 15. | హన్నాకృప సజీవసాక్ష్యాలు -1 | రూ. 65 |
| 16. | హన్నాకృప సజీవసాక్ష్యాలు -2 | రూ. 65 |
| 17. | ప్రయాణంలో ఓ మజిలి | రూ. 65 |
| 18. | నాజరు (సమ్సోను జీవిత చరిత్ర) | రూ. 65 |
| 19. | సువార్తలలోని యేసుకథ | రూ. 75 |
| 20. | యేసుకథ రెండవ భాగం | రూ. 75 |
| 21. | యేసుకథ మూడవ భాగం | రూ. 75 |
| 22. | జీవనమంతయు | రూ. 40 |
| 23. | టాల్‌స్టాయ్ కథలు 1 భాగము | రూ. 65 |
| 24. | టాల్‌స్టాయ్ కథలు 2వ భాగము | రూ. 65 |
| 25. | ఓ చినుకునవుతా... | రూ. 30 |
| 26. | మిక్కిలి సాత్వికుడు | రూ. 150 |
| 27. | విశ్వాసము విజయము-1 | రూ. 70 |
| 28. | విశ్వాసము విజయము-2 | రూ. 70 |
| 29. | విశ్వాసము విజయము-3 | రూ. 70 |
| 30. | హదస్సా | రూ. 70 |
| 31. | మిక్కిలి సాత్వికుడు | రూ.150 |

పుస్తకములు కావలసినవారు :
రెవ. డా॥ కొడవటికంటి ఇమ్మానియేల్ రాజేంద్ర
కృపాదానంగారివీధి, క్లౌపేట, 6వ లైను
ఒంగోలు-523001
ప్రకాశం జిల్లా, ఫోన్ : 9440217726

# కృపాదానం

ఒంగోలుకు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న క్రొత్తపట్నం దగ్గర బకింగ్‌హామ్ కెనాల్ నుండి నడచి ఒంగోలు వచ్చి 30 పైసలు మిగుల్చుకొనిన కృపాదానంను గాలిలో దీపం పెట్టి దేవుడా అంటే జరుగుతుందా? అన్నవాళ్ళు చాలా మంది నాకు తెలుసు. నిజానికి ఆయన గాలిలో దీపం పెట్టలేదు. ప్రభువు చేతిలో దీపం పెట్టాడు. 30 పైసలు డబ్బు మిగుల్చుకొని ఆ డబ్బుతో బియ్యం తెచ్చుకొని గంజి త్రాగేటప్పుడు దేవుడు చూడటం లేదా? ఆయన చూస్తున్నాడు అనే ధైర్యంతోనే లోకుల కామెంట్ల మీద దృష్టి ఉంచలేదు.

కుటుంబ ప్రార్థనలో అనేకసార్లు ఆకలిని గురించి పిల్లలతో మాట్లాడేవాడు. విజయవాడలో కేరళ నుంచి వచ్చిన పి.యం. సామ్యేలుగారు ఎంత కఠినంగా ప్రభువు వలన పరిశోధించబడి జయమొందాడో చెబుతుంటే విసుకు పుట్టేది. ఎప్పుడు ఆ సంగతే చెప్పేవారు. రామాయపట్నంలో తనతో చదివినవారు దాదాపు అందరు గొప్ప చర్చిలకు పాస్టర్లయినారు. మన బాప్టిస్టు మిషన్‌లో పాస్టరుగా ఉండక పోయినా క్రొత్తగా వెలుగులోనికి వస్తున్న బ్రదర్ భక్తసింగ్ ఫెలోషిప్‌తో కాని సెవెంత్‌డే వారి ధనముతో కూడిన వాగ్దాన మునుబట్టి వారితోనైనా కలవకూడదా? అని ఎవరైనా అంటే నేనెవరితోను కలవను. ప్రభువుతోనే కలిసి పనిచేస్తాను అనేవాడు. ఇప్పుడు ఉన్న కఠిన దారిద్ర్యంలో ఇంకా అయిదు సంవత్సరాలు ఉండాలి అని అంటే, అమ్మో! ఇంకా అయిదు సంవత్సరాలా? పిల్లలమైనా మేము చదువు మాని ఏదైనా ఒక ఉద్యోగం చేసుకోవాలని అనుకొనేవాడిని.

30 పైసలు మిగుల్చుకోవటానికి 15 కిలోమీటర్లు నడిచిన కృపాదానం, 1965-85 లోపల అమెరికా దేశానికి ఆరుసార్లు వెళ్ళాడు. భార్యతో కలిసి ఒకసారి వెళ్ళి దేవుని వాక్యము ప్రకటించాడు. రెండు రోజులకు ఒకసారి తన కుటుంబ సభ్యులకు అన్నం పెట్టిన కృపాదానం ప్రతిరోజు 500 మందిని 4 హాస్టళ్ళలో ఉంచి పోషించి చదివించాడు.

ఆయన జీవితమే ఒక ప్రసంగం అయింది. ఆయన జీవితం ఒక పుస్తకం అయింది. అయినప్పటికి ఆ పుస్తకము చదివిన ఆయన సంతానములో కొందరు ఆయన చేసిన పొరపాట్లనే చేస్తూ మనోవ్యాకులతకు గురి అవుతున్నారు.

కృపాదానంగారికి ఆయన తండ్రి విశ్వాస జీవితాన్ని గురించిన పుస్తకం ఇవ్వలేదు. కృపాదానం జీవితం నాకెదు రుగా ఉంచుకొని నేను జీవిస్తున్న ఈనాటి విశ్వాస జీవితానికి మూలం యేసుప్రభువు అయినప్పటికి ప్రాక్టికల్స్ కోసం కృపాదానంను ఇచ్చాడు. ఇదెంత ధన్యత.

కృపాదానం మామూలు మనిషి. ఆయన అన్నివేళల పొరపాట్లు చేశాడు. ఆయన పొరపాట్లను గురించి మాట్లాడే వారు కేవలం ఆ పొరపాట్ల వలన ఆయన పొందిన ప్రతిఫలం కొరకే వేచి ఉండాలి. ప్రతినెల వేలలో డబ్బులు అమెరికా నుండి వస్తున్నప్పుడు ఆయన వయస్సు పైపడుతున్నప్పుడు తను విశ్రాంతిగా ఉండటానికి చిన్న గది కట్టించుకోమంటే ఆయన వినలేదు. ఆ గది కట్టించుకునే డబ్బుతో ఒక గ్రామంలో ఒక మందిరము కట్టించవచ్చును అని ఎప్పుడు ఏదో ఒక గ్రామమునకు సరిపోయిన మందిరం చిన్నదే కట్టించేవాడు. దాదాపు నాలుగు సంతవత్సరాలు కఠిన ఉపవాసాలు ఉన్న తర్వాత విదేశాలో ఒక కుటుంబము వారు నెలకు 500 రూపాయలు భోజనమునకు అని ప్రత్యేకముగా వ్రాసి పంపించేవారు.

ఒంగోలులో నివశించే కృపాదానంగారి రక్తసంబంధి ఒకరు అమెరికా నుండి సహాయం చేస్తున్న వారికి - మీరు కృపాదానంకు ఎంత డబ్బు పంపుతున్నారో నాకు తెలియదు కాని అతను ఇద్దరు సువార్తికులకు ఒక్కొక్కరికి పాతిక రూపాయలు ఇచ్చి సేవకు పెట్టుకున్నాడు అని ఉత్తరం వ్రాశాడు. అమెరికా వారు ఆ ఉత్తరాన్ని కృపాదానముకు పంపిస్తూ చాలా కోపంగా కృపాదానంకు, - నీవు, నీ కుటుంబం నాలుగు సంవత్సరాలుగా ఆహారం లేక బాధపడ్డారని విని, ఇక్కడ బీదవారమైన మేము పంపగలిగిన డబ్బు పంపిస్తున్నాము. కృపాదానం పిల్లలకు కడుపునిండా

అన్నం పెట్టు అని ఉత్తరం వ్రాశారు. అప్పుడు కృపాదానం తన మీద పితూరి వ్రాసిన వారి ఉత్తరం ఆయనకు పర్సనల్‌గా ఇచ్చి, మీరు పంపుతున్న 500 రూపాయలలో దశమభాగం మాత్రం ఖర్చుచేసి సేవకులకు ఇస్తున్నాను అని అమెరికా వారికి ఉత్తరం వ్రాశాడు.

1959వ సంవత్సరం 30 పైసలు మిగుల్చుకొని సోలెడు బియ్యం కొనుక్కొని 12 మంది కుటుంబ సభ్యులకు గంజి కాచుకొని త్రాగిన కృపాదానం ఆ గంజి (అప్పట్లో) పదిమంది బిడ్డలతో పంచుకొని త్రాగేటప్పుడు ఉన్న తృప్తి 1968లో 12 మంది సంతానం కొరకు పన్నెండు కుర్చీలు గల డైనింగ్ టేబుల్ దగ్గర ఉదయం 9 గంటలకే నాన్ వెజిటేరియన్ భోజనం చేసేటప్పుడు కనిపించలేదు. తర్వాత క్రొత్తపట్నం దగ్గర సముద్రంలో బాప్తిస్మములు ఇవ్వటానికి ఫోర్డు కారు, హెరాల్డు కారును సిద్ధం చెయ్యమని డ్రైవర్‌కి చెప్పేటప్పుడు అదే క్రొత్తపట్నం రోడ్డు మీద 15 కిలోమీటర్లు నడచినప్పుడు ఉన్న తృప్తి ఇప్పుడు కార్లో వెళ్తున్నప్పుడు కనిపించలేదు.

ఏ రకంగా చూసినా ఎవరైనా ఇంట్లోకి క్రొత్త కారు కొనినప్పుడు పొందిన సంతోషం ఒక నెల రోజుల తర్వాత ఉండదు. కాని దేవుడు ప్రేమతో తన బిడ్డలకిచ్చిన బహు మానములను తన తోటి వారికి ఇవ్వలేదు. దేవుడిచ్చిన వస్తువులు మనకు మాత్రమే సొంతం అని అనుకొనేవారికి దేవుని దగ్గరనుండి వచ్చే దీవెన అనుభవము లోనికి రాదు.

కుటుంబములో జ్యేష్ట పుత్రుడినైన నాకు మాత్రమే 1951-1965 సంవత్సరంలో వచ్చిన మార్పు తెలుసు. కనుక దేవుని యెడల కృతజ్ఞతతో జీవించటానికి వీలైంది. ఈ లోకంలో దేవుడు మనకిచ్చిన ప్రతి ఈవి మనం అందరితో కలిసి పంచుకోవాలని అంటుండేవాడు. క్లౌపేటలో నుండి మిషన్ హాస్పిటల్ వెళ్ళేవారికి చాలామందికి అర్ధరాత్రి అపరాత్రి అనుకోకుండా కారు పంపించేవాడు.

అప్పటి ఒంగోలులో మొత్తంలో 13 చిన్నకార్లు ఉండేవి. 1934 మోడల్ కార్లు అద్దె కొరకు ఓపెన్ టాపు పెండ్లి ఊరేగింపు కార్లు ఉండేవి. పడమరవైపు రంగా రాయుడు చెరువు నుండి స్టేషన్ వైపు (కృపాదానం గారింటికి 2మైళ్ళ దూరం) ఒక బ్రాహ్మణ ప్లీడరు గుమస్తా కొండేపి సుబ్బయ్యగారు ఫోన్ చేసి చెరువు వద్ద ఒక హాస్పిటల్‌లో కాన్పు కష్టమైన తన కూతురును మిషన్ హాస్పిటల్‌కు తీసుకు వెళ్తారా? ఖర్చులు పెట్టుకుంటాను అని ఫోన్ చేశాడు. మీ దగ్గర డబ్బులు తీసుకోవటానికి ఇది అద్దె బండి కాదు. యేసుప్రభువు ఇచ్చిన కారు అని మంచి నిద్రలోవున్న తన పెద్ద కుమారుడిని నిద్ర లేపి కొండేపి సుబ్బయ్యగారింటికి పంపించాడు. ఆ రోజుల్లో సొంత కారు ఉన్నవారిని పలక రించే ధైర్యము కూడా అందరికి ఉండేది కాదు.

అమెరికా డబ్బులు ఎక్కువగా ప్రవహించేటప్పుడు 1976లో దేవునికి దూరంగా వెళ్ళిన కృపాదానం కుటుంబం నుండి దేవుడు తానిచ్చిన చాలా ఈవులను వెనక్కి తీసుకు న్నాడు. కృపాదానంగారు కొత్తపట్నం పల్లెపాలెంలో ప్రార్థన పెట్టడానికి బస్‌లో బయలుదేరాడు. క్రొత్తపట్నం బస్‌స్టాండు నుండి పల్లెపాలెం ఒక మైలు ఉంటుంది. రిక్షాలు ఆటోలు ఉండవు. ఇప్పుడు దేవుడు తన బిడ్డను (ఒకప్పుడు) ఎలా ఆదుకుంటాడో అనుకుంటున్న సమయంలో ఒక గవర్న మెంటు జీపు బస్‌స్టాండులో ఆగింది. 70 సంవత్సరాల వయస్సు దాటిన కృపాదానంను చూసిన సర్వే ఆఫ్ ఇండియా ఆఫీసరు, కృపాదానంతో సముద్రం వద్దకు వస్తారా? అని అడిగి ఆయనను ఎక్కించుకొని ప్రార్థనకు వదిలిపెట్టాడు. నాకు కండ్లలో నీళ్ళు తిరిగాయి. ఎవరైనా గర్వించి మన మాట వినకపోతే వారు అవసరాలలో ఉన్నప్పుడు అంతే కావాలి అనుకుంటాము. అయితే ప్రేమ గల మనప్రభువు మనము మంటివారమని ఆయన జ్ఞాపకము చేసుకొను చున్నాడు. **(సశేషం)**


**దయచేసి పత్రిక కొరకు మీరు పంపించే చందా**
**మనియార్డర్ ద్వారా పంపదలుచుకుంటే**
**ఈ క్రింద అడ్రసుకు పంపగలరు.**
**కె. ఇమ్మానియేల్ రాజేంద్ర,**
**ఎడిటర్, హన్నాకృప ఆధ్యాత్మిక మాసపత్రిక**
**6వ లైను, క్లౌపేట, ఒంగోలు-523001**
**ప్రకాశం జిల్లా, ఫోన్: 9440217726**

స్త్రీల విభాగం

# బత్షెబ

యేసుక్రీస్తు వంశావళిలో పలకరించబడిన నాల్గవ స్త్రీ బత్షెబ. ఆమె జీవితం ఈ సంచిక ధ్యానభాగము.

2 సమూయేలు 11వ అధ్యాయంలో బత్షెబను గురించి ప్రస్తావించబడింది. బత్షెబ తండ్రిపేరు ఏలీయాము. బత్షెబ భర్త పేరు ఊరియా. బత్షెబ తండ్రి మరియు భర్త ఇద్దరూ దావీదు రాజు సైన్యంలో ముఖ్యులు. అంటే బత్షెబ బాల్యం నుండే రాజరికపు ఆచారాలు, రాజు యొక్క అధికార బలాలు అన్ని ఎరిగిఉన్న స్త్రీ.

బత్షెబ ఒక ఇశ్రాయేలీయురాలు అంటే దేవున్ని ఎరిగిన స్త్రీ. ఆమె సౌందర్యవతి అని వ్రాయబడింది. ఆమె తన అందాన్ని బట్టి అతిశయించలేదు. సహజంగా శారీరకమైన అందం మనుష్యుల గర్వానికి కారణం అవుతుంది. అందు లోను ముఖ్యంగా స్త్రీలకు. కాని బత్షెబ జీవితాన్ని పరిశీలిస్తే ఆమె సౌందర్యం వలన ప్రభావితమైనదిగా ఆమె ప్రవర్తన ఎక్కడా నిర్వచించబడలేదు. ఆమె తన అపవిత్రతను పోగొట్టుకొను నిమిత్తం ఇశ్రాయేలీయుల ఆచారం ప్రకారం స్నానమాచరించింది. అది కూడ ప్రొద్దుగ్రుంకిన వేళ అని వ్రాయబడింది. అంటే బత్షెబ ఎటువంటి దురుద్దేశంతో కాక చీకటి పడ్డాక ఆచారపరమైన క్రియలలో భాగంగా ఆచరించిన స్నానం రాజైన దావీదు దృష్టిలో పడింది.

రాజు ఆమెను పిలువనంపించినప్పుడు ఆమె కారణాలు ఎరుగకపోయి ఉండవచ్చును, కానీ రాజు తనను ఎందుకు పిలువనంపాడు అని ఆలోచించి ఉంటుంది. దావీదు రాజు యొక్క ఉద్దేశం గురించి ఊహించకపోయినను లేశ మాత్రంగా అయినా అనుమానించి ఉంటుంది. అయితే ఆమె రాజు యొక్క సర్వాధికారాన్ని చిన్నతనం నుండి ఎరిగిన వ్యక్తిగా దావీదు రాజు యొక్క ప్రయత్నాన్ని, ఆలోచనను ఎదిరించలేకపోయింది. వ్యభిచరించడం దేవునికి వ్యతిరేక మైనదని ఎరిగిన స్త్రీగా ఆ స్థితి నుండి పారిపోవడానికి ప్రయత్నించక, దేవుని నిమిత్తం రాజును ఎదిరించు ధైర్యసాహసాలు లేని ఒక మాములు స్త్రీగా దావీదు రాజుకు తలొగ్గింది.

ఒక రకంగా బత్షెబ నామకార్ధ ఇశ్రాయేలీయురాలు అనవచ్చు. నామకార్ధ క్రైస్తవులు ఎలా అయితే దేవునికి కాక తమ ముందున్న పరిస్థితులను బట్టి లోకంతో, లోక ఆచారాలతో రాజీపడుతూ జీవిస్తుంటారో బత్షెబ కూడా అంతే. ఆమె దేవున్ని ఎరిగిన స్త్రీనే కాని దేవునితో వ్యక్తిగత సహవాసం లేని స్త్రీగా కనబడుతున్నది.

తెలిసిన చేసినా తెలియక చేసినా పాపము చేస్తే దాని ఫలితాన్ని అనుభవించవలసిందే. దావీదు బత్షెబల పాప ఫలితంగా బత్షెబ గర్భవతి అయింది. భర్త యుద్ధమునకు వెళ్ళియుండగా గర్భవతి అవ్వడం అంటే తన పాపము బట్టబయలు అవ్వడమే. కాబట్టి ఏం చేయాలో తెలియక పరిష్కారం నిమిత్తం దావీదుకు తెలియపరచింది. దావీదుకు తెలియచేసినప్పటికి తన అయోమయ స్థితిని బట్టి దేవునిని ఆశ్రయించి ఉంటుంది. పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నప్పుడు మనుష్యులు దేవునిపై ఆధారపడతారు. బత్షెబ కూడ దేవుని మీద ఆధారపడటం ప్రారంభించింది.

బత్షెబ దేవుని మీద ఆధారపడటం ప్రారంభించిందో లేదో ఆమె మరొక విషాదకరమైన పరిస్థితి గుండా వెళ్ళవలసి వచ్చింది. దావీదు తన పాపాన్ని కప్పిపుచ్చుకోడానికి బత్షెబ భర్త అయిన ఊరియాను యుద్ధము నుండి పిలిపించిన ప్పటికి ఊరియా ఇంటికి వెళ్ళకపోవడంతో తన ప్రయత్నం విఫలం అయిందని గ్రహించి చివరికి ఊరియాను చంపించ వలసి వచ్చింది. భర్త చనిపోవడంతో బత్షెబ పరిస్థితి దయనీయంగా మారింది.

తన పరిస్థితి ఏంటో, తన జీవితం ఏమి కాబోతుందో ఏమి తెలియని అయోమయ స్థితిలోకి వెళ్ళింది బత్షెబ. దావీదు రాజు ఆమె స్థితి మారుస్తాడా? పరువు నిమిత్తం తన భర్తను చంపించిన వ్యక్తి తన గురించి ఆలోచిస్తాడా?

తన పరిస్థితే ప్రశ్నార్థకంగా ఉంటే దానికి తోడు తను గర్భవతి. దానిని దాచలేదు. అది బయటపడిన రోజున బంధువుల, స్నేహితుల ముందు తన ప్రవర్తన నీచమైనదిగా కనిపిస్తుంది. ఇంకా అందరూ తనను భర్త విషయంలోను నిందిస్తారు అనే దిక్కుతోచని స్థితిలో దేవున్ని ఆశ్రయించింది బత్షెబ.

దేవున్ని ఆశ్రయించటం అంటే పూర్తిగా దేవుని మీద ఆధారపడటం. పరిష్కారం నిమిత్తం ఎటువంటి ప్రయత్నము చేయక తన జీవితంలో జరుగు ప్రతి చిన్న విషయం దేవుని సంకల్పముగా భావించడం. దేవుడు తన జీవితాన్ని నడిపించుటకు ఆయన అధికారాన్ని ఒప్పుకోవడమే కాక తను చేసిన పాపమును బట్టి పశ్చాత్తాప పడింది. ఎప్పుడైతే బత్షెబ హృదయ పరివర్తన ప్రారంభమైందో దేవుడు ఆమె జీవితాన్ని మార్చివేశాడు.

తన భర్త నిమిత్తం దుఃఖదినములు పూర్తి అయ్యాక దావీదు రాజు బత్షెబను పెండ్లి చేసుకున్నాడు. అయితే మారిన తన పరిస్థితిని బట్టి ఆమె గర్వించకుండునట్లు ఆమె గర్భమున పుట్టిన శిశువును దేవుడు తీసుకొనగా బత్షెబ పరిస్థితి మాటల్లో చెప్పలేనిది. రాజగృహములో ఉన్నప్పటికి, లోకములో చెల్లుబాటు అయ్యే సర్వ అధికారాలు ఉన్నప్పటికి దేవుని ముందు మనుష్యులు నిమిత్తమాత్రులని, దేనికి కొరగానివారని గ్రహించింది. చిన్నతనం నుండి అధికార మును గురించి తన హృదయంలో నాటుకున్న ఆలోచనలు అనుమానాలు అన్ని పటాపంచలై దేవుని సర్వాధికారానికి లోబడటం నేర్చుకున్నది ఫలితంగా జ్ఞాని అని ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన సొలొమోనును కుమారునిగా పొందు కున్నది.

సొలొమోను జ్ఞాని అని ప్రఖ్యాతి గాంచుటకు కారణం అతను దేవుని మీద ఆధారపడి దేవుని నుండి రాజ్యాలను, ధనమును కాక వివేచనను అడగడమే. అయితే సొలొమోను ఆ విధంగా దేవుని మీద ఆధారపడునట్లు అతని జీవితాన్ని మలచింది తల్లియైన బత్షెబనే అని చెప్పటం అతిశయోక్తి కాదు. దావీదు రాజుకు ఎంతో మంది కుమారులు ఉండగా, సొలొమోను రాజుగా స్థిరపరచబడటంతో బత్షెబ మహారాణి స్థానాన్ని పొందింది. దావీదు మరణించిన తరువాత కూడ, ఆమెను ఎవరూ వేలెత్తి చూపలేని స్థితిలో దేవుడు ఆమెను నిలబెట్టాడు.

బత్షెబ సర్వాధికారమును గ్రహించి, ఆయనపై పూర్తిగా ఆధారపడేంత వరకు ఆమె జీవితం అయోమయంగా, దయనీయంగా, నిందలతో కూడినదిగా ఉన్నది. అయితే తనను ఆశ్రయించిన వారిని దేవుడు తప్పక ఆదరిస్తాడు అనుటకు బత్షెబ జీవితమే ఒక ఉదాహరణ.

క్రైస్తవ స్త్రీలైన మనము దేవుని మీద ఆధారపడి, ఆయన సర్వాధికారానికి లోబడినట్లయితే దేవుడు మన జీవితాలను కూడా ఆశ్చర్యకరమైన రీతిలో మార్చి మన కుటుంబాలను కడతాడని గ్రహించి అట్లుండుటకు ప్రయాసపడదాం. దేవుని దీవెనలు పొందుకుందాం!

---

**(13వ పేజి తరువాయి)**

అడిగినప్పుడు ఏమో ఇప్పుడే ఏమీ చెప్పలేము అంటున్నారు. క్రిటికల్ కండీషన్ అని చెప్పారు అన్న వెంటనే అల్లుడి గురించి మొకరించి ప్రార్థించడం జరిగింది. వాస్తవానికి దర్శనాలు, బయలు పరచడాలు లాంటివి నాకు తెలియదు. పెద్దగా నమ్మను కూడా. అటువంటిది నా జీవితంలో మొట్ట మొదటిసారిగా ఒక తెల్లటి వస్త్రముగల చేయి నాకు ఆ ప్రార్థనలో కన్పించడం జరిగింది. బావా చిన్నోడికి దేవుడు స్వస్థత ఇస్తున్నాడు అని చెప్పినప్పుడునాకు కలిగిన ధైర్యం అంతా ఇంతా కాదు. తర్వాతి వారంలో మా బావగార్ని, అక్కని కుటుంబాన్ని కలిసి దేవుడు చేసిన ఆశ్చర్యకరమైన సంగతుల గురించి వివరించి ప్రార్థించి అల్లుడికిచ్చిన స్వస్థత గురించి ఆ దేవదేవునికి కృతజ్ఞతలు చెల్లించి వచ్చాను.

ఈ నా సాక్ష్యం నేను ఎంతో దుఃఖంతో, భారంతో నా మాట కూడా ప్రభువు వింటాడా అన్న ఆశ్చర్యంతో వ్రాస్తు న్నాను. దేవుడు కరుణిస్తే మరెన్నో విషయాల్ని పాఠకులతో పంచుకోవాలనుంది. నా విశ్వాస జీవితం బలపడడానికి మీ ప్రార్థనా సహకారాన్ని ఆశిస్తూ అభివందనాలతో...

**చిన్నపిల్లల పేజి**

# చెడు స్నేహం

రవి మంచి అబ్బాయి. చదువులోను ఫస్ట్. స్కూల్ నుండి ఇంటికి వచ్చేసరికి వంటింటి నుండి వస్తున్న ఘుమఘుమలు రవిని వంటింటి వైపు పరిగెత్తేలా చేశాయి.

మమ్మీ మమ్మీ ఏం చేస్తున్నావ్, మంచి టేస్టీ ఫుడ్ వండుతున్నట్లున్నావ్ అన్నాడు రవి, సరే ముందు బ్యాగ్స్ రూమ్‌లో పెట్టి కాళ్ళు చేతులు కడుగుకొని రా అన్నది తల్లి నవ్వుతూ.

అమ్మ చేసిన సూపీ న్యూడిల్స్ గబగబా తినేసి మమ్మీ కాసేపు టి.వి చూస్తాను ప్లీజ్ అన్నాడు రవి. ముందు హోం వర్క్ కంప్లీట్ చేయి, ఆ తరువాత టి.వి చూద్దువు అన్నది తల్లి. రవి హోం వర్క్ కంప్లీట్ చేయగానే తల్లి బయటకు వెళ్ళి స్నేహితులతో ఆడుకోమని చెప్పింది. ముందు కాస్త నిరాశపడినా, తన స్నేహితలను చూడగానే అన్ని మరచిపోయి ఆనందంగా ఆటల్లో మునిగిపోయాడు రవి.

మరునాడు స్కూల్‌లో ఇంటి దగ్గర కార్‌రేసింగ్ గేమ్ ఆడాలని నిర్ణయించారు రవి స్నేహితులందరూ. ఆ తరువాతి రోజు స్నేహితులలో ఒకరు సెకెండ్ లెవల్ అంటే ఇంకొకరు నేను థార్డ్ లెవల్ రా అని మాట్లాడుకుంటు న్నారు. రవి మాత్రం మౌనంగా ఉన్నాడు. ఏరా రవి ఏం మాట్లాడవేంటి? నిన్న నువ్వు గేమ్ ఆడలేదా? అడిగాడు రమేష్. లేదురా నిన్న అమ్మని సెల్ అడగాలని చాలా ట్రై చేశా కాని భయమేసింది. మా అమ్మ చాలా స్ట్రిక్ట్. టి.వి చూస్తాను అంటేనే ఒప్పుకోలేదు. ఇక నేను సెల్‌ఫోన్ అడిగితే ఇక అంతే. అన్నాడు రవి దిగాలుగా. ఇది అందరి ఇళ్ళల్లో ఉండే ప్రాబ్లమే. నువ్వు మీ అమ్మను ఫోన్ అడుగు, ఇవ్వను అంటే ఇస్తేనే అన్నం తింటానని మారం చెయ్ ఫోన్ నీ చేతికి వస్తుంది అన్నాడు సుకేష్. అదేం కాదు రా, స్కూల్ ప్రాజెక్ట్ కోసం ఫోన్ కావాలని అడుగు ఖచ్చితంగా ఇస్తుంది మీ మమ్మీ ఫోన్ అన్నాడు నవీన్. అందరూ అంతే అన్నట్లు తలలాడించారు. అబద్ధమాడటానికి రవికి భయం వేసినా, ఈ ప్లాన్ పనిచేస్తది అనిపించింది.

అమ్మతో ఫోన్ గురించి ఎలా చెప్పాలా అని ఆలోచి స్తుండగా తల్లే వచ్చి ఏంటి రవి? ఏమి ఆలోచిస్తున్నావ్? స్నాక్స్ కూడా తినకుండా అన్నది. ఏం లేదు మమ్మీ స్కూల్‌లో ప్రాజెక్ట్ వర్క్ ఇచ్చారు. దాని కోసం ఫోన్ కావాలి అన్నాడు. వర్క్ కోసమేగా తీసుకో అని ఫోన్ అందించింది తల్లి.

రవి ఆనందానికి హద్దులు లేవు. కార్ రేసింగ్ గేమ్‌ను ఆడటం స్టార్ట్ చేశాడు. తన ఫ్రెండ్స్ చెప్పినట్లే గేమ్ చాలా ఆసక్తిగా ఉంది అనుకుంటూ ఫస్ట్ లెవల్ కంప్లీట్ చేశాడు. సెకండ్ లెవల్ స్టార్ట్ చేయబోయే లేపు రవీ, ఫోన్‌తో పని అయ్యిందా? ఇక లేచి స్నానం చేసి భోజనానికి రా అన్న అమ్మ పిలుపు విని సర్దుకున్నాడు రవి. ఆనందంతో రవికి ఆ రాత్రి నిద్ర పట్టలేదు.

మరునాడు చాలా ఉత్సాహంగా ఫ్రెండ్స్‌తో రేయ్ నేను కార్ రేసింగ్ గేమ్ ఆడానురా అన్నాడు రవి. ఎన్ని లెవల్స్ ఆడావు రా అన్నాడు సుకేష్ వెటకారంగా. ఒకటి అన్నాడు రవి అమాయకంగా. రేయ్ మేమందరం సెవెంత్ లెవల్‌లో ఉంటే నువ్వు కేవలం ఫస్ట్ లెవల్‌లో ఉండి ఏదో పెద్ద ఘనకార్యం చేసినట్లు చెప్తావే అన్నాడు రమేష్, సుకేష్‌కి వంత పాడుతూ. అందరూ ఫక్కున నవ్వగానే రవికి పంతం పెరిగింది.

ఎలాగైనా ఫోన్‌లో గేమ్ ఆడాలని నిశ్చయించుకొని ఇంటికి చేరుకున్న రవి తల్లితో ఇంకా ప్రాజెక్ట్ వర్క్ కంప్లీట్ అవ్వలేదని చెప్పి ఫోన్ తీసుకున్నాడు. కానీ ఒక గంట కూడ కాక ముందే తల్లి వచ్చి ఫోన్ తీసుకోవడంతో ఏం చేయాలో అర్థం కాలేదు రవికి. రేపు స్నేహితులందరూ ఏడిపిస్తారని ఎలాగైనా గేమ్‌లో కనీసం ఇంకో రెండు లెవెల్స్ కంప్లీట్ చేయాలని నిశ్చయించు కొని అమ్మ నిద్రపోయాక ఫోన్ తీసుకొని గేమ్ ఆడి, అమ్మకు అనుమానం రాకుండా ఫోన్ ఎక్కడ నుండి తీశాడో అక్కడే పెట్టేశాడు.

దొంగతనంగా ఫోన్ వాడటం రవి దినచర్య అయింది. అబద్ధాలు చెప్పడం అలవాటయ్యింది. ఒంట్లో నలతగా ఉ

ఉందని చెప్పి సండేస్కూల్‌కి వెళ్ళకుండా ఇంట్లోనే ఉండి తల్లి చర్చికి వెళ్ళగానే ఫోన్‌లో గేమ్స్ ఆడేవాడు రవి. రవి మనసంతా ఫోన్ మీదనే. చదువు సన్నగిల్లింది. ఆ గేమ్ బోర్ కొడితే ఇంకో గేమ్ అంటూ గేమ్స్ ఆడుకోవడం అలవాటయ్యింది. రవి ప్రవర్తనలో మార్పు గమనించిన తల్లి ఫోన్ వాడవద్దని మందలించినా రవి వినకుండా అవకాశం దొరకగానే ఫోన్ వాడేవాడు.

అనుకోకుండా ఒక రోజు ఒంట్లో నలతగా ఉందని స్కూల్‌కి వెళ్ళలేనని రవి చెప్పడంతో తల్లి సరే అన్నది. ఆ పరిస్థితిలో కూడా రవి ఫోన్‌లో గేమ్ ఆడాలని లేవబోయి క్రింద పడిపోవడంతో తల్లి హడావిడిగా వచ్చి హాస్పిటల్‌కి తీసుకెళ్ళింది. డాక్టర్, రవికి జ్వరం రావడానికి కారణం నిద్రలేక పోవడం అని, కంటి నరాలు బాగా దెబ్బతిన్నాయని. ఇక ముందు కూడా ఇలానే ఉంటే పూర్తిగా చూపు కోల్పోయే ప్రమాదముందని చెప్పాడు. రెండు రోజుల తర్వాత కళ్ళజోడుతో ఇంటికి చేరిన రవి ఇంకా నీరసంగానే ఉన్నాడు.

రవి స్నేహితుల కారణంగా అబద్ధాలు ఆడటం మొదలు పెట్టాడు. దాని వలన ఫోన్‌లో గేమ్స్ ఆడటం వ్యసనంగా మారింది. ఆ వ్యసనం అతని కళ్ళను దెబ్బతీసింది. అమ్మ చెప్పే మాటలు అప్పుడుకాని అర్థం కాలేదు రవికి. కానీ అప్పటికే జరగవలసిన నష్టం జరిగిపోయింది.

*"నీ తల్లిదండ్రులను నీవు సంతోషపెట్టవలెను నిన్ను కనిన నీ తల్లిని ఆనందపరచవలెను" సామెతలు 23:25*

### సాక్ష్యాలకు ఆహ్వానము

మీ జీవితాలలో దేవుడు చేసిన మేలులను ఇతరులకు తెలియపరచుట ద్వారా దేవుని నామానికి మహిమ కలగడమే కాక వినినవారు విశ్వాసంలో బలపడుటకు మీ సాక్ష్యం ఉపయోగపడవచ్చు. కావున మీ అమూల్యమైన సాక్ష్యాలు మాతో పంచుకొనిన యెడలవాటిని సంతోషంగా పత్రికా ముఖంగా ప్రచురించుటకు మేము సిద్ధంగా ఉన్నాము. దేవుని నామ ప్రకటనలో మాతో పాటు మీరు పాలి భాగస్తులు కావాలని ఆశిస్తున్నాము.


## సండేస్కూల్ మెటీరియల్


| | |
|---|---|
| సండేస్కూల్ యాక్టివిటి బుక్-1 | రూ. 50/- |
| సండేస్కూల్ యాక్టివిటి బుక్-2 | రూ. 50/- |
| సండేస్కూల్ యాక్టివిటి బుక్-3 | రూ. 50/- |
| సండేస్కూల్ యాక్టివిటి బుక్-4 | రూ. 50/- |
| సండేస్కూల్ కలరింగ్ బుక్-1 | రూ. 50/- |
| సండేస్కూల్ కలరింగ్ బుక్-2 | రూ. 35/- |
| సండేస్కూల్ బైబిల్ స్టోరీస్ బుక్-1 | రూ. 50/- |
| సండేస్కూల్ బైబిల్ స్టోరీస్ బుక్-2 | రూ. 50/- |
| సండేస్కూల్ బైబిల్ స్టోరీస్ బుక్-3 | రూ. 50/- |
| మార్గము-వి.బి.యస్. మెటీరియల్ | రూ. 35/- |
| ఆత్మఫలము-వి.బి.యస్. మెటీరియల్ | రూ. 35/- |
| బైబిల్‌బాలలు-వి.బి.యస్. మెటీరియల్ | రూ. 35/- |
| ధన్యతలు-వి.బి.యస్. మెటీరియల్ | రూ. 35/- |
| బిగినర్స్ యాక్టివిటి బుక్ (ఒ.టి.) | రూ. 25/- |
| బిగినర్స్ యాక్టివిటి బుక్ (యన్.టి.) | రూ. 25/- |
| సండేస్కూల్ సాంగ్స్ బుక్ | రూ. 60/- |
| సండేస్కూల్ డైరి | రూ. 75/- |
| సండేస్కూల్ స్టోరీస్ బుక్-1 | రూ. 35/- |
| సండేస్కూల్ స్టోరీస్ బుక్-2 | రూ. 40/- |
| సండేస్కూల్ టీచర్స్ గైడ్ | రూ. 60/- |
| సండేస్కూల్ స్కిట్స్ | రూ. 40/- |
| సండేస్కూల్ మెమోరి వర్సెస్ బుక్ | రూ. 15/- |
| సండేస్కూల్ స్టిక్కర్స్ (32 ప్యాక్) | రూ. 160/- |
| **సండేస్కూల్ గేమ్స్** | |
| బైబిల్ ఇండెక్స్ గేమ్ | రూ. 250/- |
| బైబిల్ ఫ్యామిలి నేమ్స్ గేమ్ | రూ. 250/- |
| బైబిల్ నేమ్స్ గేమ్ | రూ. 350/- |
| బైబిల్ వర్సెస్ స్టార్ గేమ్ | రూ. 300/- |
| బైబిల్ నేమ్స్ ప్రిడిక్షన్ గేమ్ | రూ. 150/- |
| బైబిల్ క్విజ్ గేమ్ | రూ. 350/- |
| యానిమల్స్ అండ్ బర్డ్స్ ఇన్ బైబిల్ గేమ్ | రూ. 350/- |
| హెవెన్ అండ్ హెల్ మెమోరి వర్సెస్ గేమ్ | రూ. 450/- |

**బైబిల్ లిటరేచర్ మినిస్ట్రీ**

ఫోన్ : 9440217726



# బైబిల్ క్విజ్-04



**నిర్గమకాండము 26 - లేవీయకాండము 10**

1. మందిరమును ఎన్ని తెరలతో చేయమని చెప్పెను? (నిర్గమ. 26)
2. దీపము నిత్యము వెలుగునట్లు ప్రదీపమునకు ఏ నూనె తీసుకురమ్మని ఇశ్రాయేలీయులకు చెప్పెను? (27అ)
3. అహరోను కుమారుల పేర్లు ఏమిటి? (28అ)
4. కోడెను ఎక్కడ వధించాలని దేవుడు మోషేతో చెప్పెను? (29)
5. లెక్కింపబడిన వారిలో చేరు ప్రతివాడు యెహోవాకు ప్రతిష్ఠార్పణగా ఎంత ఇవ్వవలెను? (30 అ)
6. విశ్రాంతి దినమున పనిచేయు వానికి విధింపవలసిన శిక్ష ఏమిటి? (31అ)
7. దేవునికి వ్యతిరేకముగా దూడను చేసిన తర్వాత ఎంతమంది చంపబడిరి? (32అ)
8. ఇశ్రాయేలీయులు తమ ఆభరణములను ఎక్కడ తీసివేసిరి? (33అ)
9. సీనాయి కొండమీద మోషే దేవునితో ఎంతకాలం గడిపెను? (34అ)
10. బెసలేలు తాతగారి పేరేమిటి? (35అ)
11. మందిరమునకు పలకలను ఏ కఱ్ఱతో చేసెను? (36అ)
12. దీపస్తంభమునకు ఎన్ని కొమ్మలు ఉంటాయి?(37 అ)
13. ఆహోలియాబు ఏ గోత్రమునకు చెందినవాడు? (38అ)
14. పరిశుద్ధ కిరీట భూషణము మీద వారు ఏమని వ్రాసిరి? (39అ)
15. ప్రత్యక్షపు గుడారపు మందిరము ఎప్పుడు నిలువ బెట్టబడెను? (40అ)
16. దహనబలిగా ఏ పక్షులను దేవునికి అర్పించాలి? (లేవీయ. 1)
17. ఇశ్రాయేలీయులు అర్పించు ప్రతి అర్పణతో ఏమి చేర్చి అర్పింపవలెను? (2అ)
18. తరతరములకు నిత్యమైన కట్టడగా ఏమి తినవద్దని దేవుడు ఆజ్ఞాపించెను? (3అ)
19. అధికారి పొరపాటున పాపము చేసి అది తనకు తెలియ బడిన యెడల అర్పణముగా ఏమి తేవలెను? (4అ)
20. రెండు తెల్లగువ్వలైనను రెండు పావురపు పిల్లలైనను దొరకని యెడల పాపము చేసినవాడు ఏమి తేవలెను?(5)
21. 6వ అధ్యాలో 'అతి పరిశుద్ధము' అను మాట ఎన్నిసార్లు ఉంది? (6అ)
22. 7వ అధ్యా.లో పేర్కొనబడిన జంతువులు ఏవి? (7అ)
23. 8వ అధ్యా.లో పేర్కొనబడిన సంఖ్యలు ఏమిటి? (ఉదా: 3 దినములు, 4 పక్షులు)? (లేవీయ. 8)
24. అహరోను తన కొరకు ఏ బలిని అర్పించెను? (9అ)
25. ఎల్సాఫాను తండ్రి ఎవరు? (10అ)

## బైబిల్ క్విజ్ - 03 జవాబులు

1. షిఫ్రా,పూయా (నిర్గమ. 1:15) 2. గెర్షోము (2:22) 3. నేనుఉన్నవాడనుఅనువాడను (3:14) 4. నీరు రక్తముగా మార్చుట (4:9) 5. కొయ్యకాలు కూర్చుటకు (5:12) 6. అమ్రాము, యోకెబెదు (6:20) 7. 80 సంగులు (7:7) 8. ఈగలు రావడం (8:24) 9. జనుప, యవలు (9:26) 10. యెహోవా (10:20) 11. ప్రథమ సంతా నము చనిపోవుట (11:5) 12. 430 సంగులు (12:40) 13. అబీబు నెలలో (13:4) 14. బయల్సె ఫోను (14:2,9) 15. చేదు (15:23) 16. ఓమెరు (16:16) 17. శోధించుట (17:7) 18. ఎలీయెజరు (18:4) 19. సీనాయి (19:1) 20. దొంగిలకూడదు (20:15) 21. మరణశిక్ష (21:15) 22. మరణశిక్ష (22:18) 23. మూడు మారులు (23:17) 24. ఆరు దినములు (24:16) 25. మందసములో (25:16,25).

**బైబిల్ క్విజ్-03 జవాబులు పంపినవారు :**

1. ఆనీమేరి-హైదరాబాద్, 2. క్రిస్టియానమ్మ,-నందికొట్కూరు, 3. స్వప్నిక-మార్కాపురం, 4. డి. మెర్సీ ఇశ్రాయేల్-నెల్లూరు, 5. బి. సువార్తరాజు-బెంగుళూరు, 6. కె. లలిత-కావలి, 7. శాంతకుమారి-చెన్నై, 8. రాజ్‌కుమార్-హైదరాబాద్, 9. యం. రాధ-విజయవాడ, 10. కె. సుమలత-గుంటూరు, 11. టి. ఎస్తేరు-నిడదవోలు.